# 12

# హృదయ స్పందన

## (5:21-48)

నీతి, దాపరికంలేని పాపపు చర్యను మించినదైయుండి ఇటువంటి చర్యకు ముందుగా వచ్చు ఆలోచనను గుర్తించును (12:35; 15:18–20). అదొక ఆజ్ఞకు ఉన్నది ఉన్నట్టుగా లోబడుట మాత్రమే కాదు, కానీ ఆ ఆజ్ఞకు వెనుక నున్న స్ఫూర్తిని కూడ నిమగ్నము చేయును. ఈ అవగాహన ననుసరించి, యేసు వాస్తవమునకు శాస్త్రులు పరిసయ్యుల కంటే నిక్కచ్చిగా ప్రవర్తించాడు. గనుక ఆయనను వెంబడించువారు రాజ్య సంబంధమైన కార్యములను రాజ్య సంబంధమైన హృదయములో నుండి విడుదల చేయవలెనని ఆయన కోరాడు.

20వ వచనములోని మహత్వపూర్ణమైన ఆయన ప్రకటన కొండ మీద ప్రసంగములోని మిగిలిన భాగమును ఆతురతతో అపేక్షించుచున్నది మరియు దానిని క్రోడీకరించుచున్నది. ఆయన తన యెదుట కూడుకొని యుండిన జనసమూహముతో పాటు, తన శిష్యులకు ఉపదేశించుచు. ధర్మశాస్త్రము గూర్చి ఇతరులు చెప్పిన దానికిని దాని యొక్క అసలు ఉద్దేశమునకును మధ్య గల ఆరు భేదనిరూపణములను నివేదించాడు. కోపము (5:21–26), వ్యభిచారము (5:27–30), విడాకులు (5:31, 32), ఒట్టు పెట్టుకొనుట (5:33–37), పగతీర్చుకొనుట (5:38–42), మరియు శత్రువుల యెడల ప్రదర్శింపబడవలసిన ప్రేమ (5:43–48) గూర్చి ఆయన మాటలాడాడు. ప్రజలు ధర్మశాస్త్రమును అక్షరానుసారంగా గైకొనుచునే దాని స్ఫూర్తిని అలక్ష్యము చేయగలరని చూపించుటకు ఆయన సోదాహరణంగా వివరించిన దృష్టాంతములు రూపొందింపబడినవై యుండినవి.

### కోపము మరియు హత్య (5:21–26)

**21నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో
చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. 22నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరునిమీద
కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని
చెప్పువాడు మహా సభకు లోనగును; ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును.
23కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి
విరోధమేమైననుకలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల 24అక్కడ బలిపీఠము నెదుటనే
నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధాన పడుము అటు
తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము. 25నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే
త్వరగా వానితో సమాధానపడుము; లేనియెడల ఒకవేళ నీ ప్రతివాది నిన్ను న్యాయాధిపతికి
అప్పగించును, న్యాయాధిపతి నిన్ను బంట్రౌతుకు అప్పగించును, అంతట నీవు చెరసాలలో
వేయబడుదువు. 26కడపటి కాసు చెల్లించువరకు అక్కడ నుండి నీవు వెలుపలికి రానేరవని
నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**

**వచనము 21.** యేసు తన మొదటి భేద నిరూపణమును పరిచయము చేయుటకు ఆయన పలికిన "... అని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా" అను మాటలు ధర్మశాస్త్రములో నుండి పుట్టుకొచ్చి పూర్వము ఎన్నో శతాబ్దాలుగా పొగైన యూదీయ సాంప్రదాయములను సూచించినవి. ఆయన లేఖనములను సుస్పష్టముగా ప్రస్తావించుచుండినప్పుడు సూచించినట్లు, ఇప్పుడు "... అని రాయబడి యున్నది" అను మాటలను ఆయన తన భేద నిరూపణములకు తొలిపలుకులుగా ప్రస్తావించలేదు. దానికి బదులుగా, యూదులు మౌఖిక ఉపదేశములను మరియు సాంప్రదాయములను సూచించినప్పుడు "... అని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా" అను పదజాలమును ఆయన పలుమార్లు ఉపయోగించాడు (5:27, 33, 38, 43). 5:31లో, ఇదే పదజాలము "... అని చెప్పబడియున్నది గదా" అని కుదింపబడినది.

యేసు ప్రయోగించుచుండిన ఈ భాష వారు వాదోపవాదములలో నిమగ్నమై యుండినప్పుడు "యూదుల బోధకులు ఉపయోగించిన ఒక యుక్తియై యుండినది."[1] యూదులు, బోధకులు మరియు శాస్త్రులు చేసిన అనువాదములకును ధర్మశాస్త్రము యొక్క మూలార్థమునకును మధ్య ఉండిన భేద నిరూపణమును ఆయన చూపించుచుండెను. ఆనాటి మతసంబంధమైన యూదీయ ఉపదేశకులు, పాండిత్యమును తెలిపెడి తీరులో, తరుచుగా గతకాలమందలి గొప్ప మత నాయకుల పలుకుల నుండి ఉల్లేఖించి చెప్పుచుండిరి. మరొక ప్రక్క యేసు, "వారి శాస్త్రులవలె గాక, వ్యక్తిగతమైన అధికారముగలవానిగా" మాటలాడుచుండెను (7:29). "అయితే నేను మీతో చెప్పునదేమనగా" అను మామూలు మాటల్లో, ధర్మశాస్త్రము గూర్చి వారి అతి తెలివిని మరియు అనుచితమైన ప్రయోగమును యేసు తుడుచిపెట్టాడు.

**నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని.** "పూర్వికులు" ఉపదేశకులు చెప్పారు. యేసు యొక్క తొలి ఉల్లేఖనము పది ఆజ్ఞలలో నుండి తీసికొనబడినది (నిర్గమకాండము 20:13; ద్వితీయోపదేశకాండము 5:17), ఇది పూర్వీకులకు సుపరిచితమైనదై యుండెను. రెండవది నరహత్య చేసినవాడు "తీర్పునకు లోనగునుని" లేక న్యాయస్థానంలో విచారింపబడునని (ద్వితీయోపదేశకాండము 16:18; 17:8-13) ప్రకటించిన యూదీయ సాంప్రదాయమును ప్రతిబింబించుచున్నది. హత్యచేసినవానికి ధర్మశాస్త్రము మరణ దండనను అధికారపూర్వకంగా నిర్దేశించినది (నిర్గమకాండము 21:12; లేవీయకాండము 24:21; సంఖ్యాకాండము 35:16-21, 30, 31).

స్పష్టముగా, అది ఆచరణలో నియమ ప్రకారము అంగీకరింపబడకపోయినప్పటికిని, పది ఆజ్ఞలలోని ఆరవ ఆజ్ఞను, ఆలోచనలతో లేదా వైఖరులతో నిమిత్తము లేకుండా, ఒక భౌతిక చర్యగా మాత్రమే యూదీయ నాయకులు దాని విలువను తగ్గించారు. ఈ అనువాదము ప్రకారము, స్వనీతిపరుడైన న్యాయబద్ధవాది, హత్య చేయవలెనను ఆలోచన వాని హృదయంలో ఉన్నప్పటికిని, తాను వాస్తవముగా ఒకరి ప్రాణము తీయనంత వరకు, తనకైతాను దీనితో తృప్తిపడవచ్చును. చంపనుద్దేశముగల హృదయమును భద్రముగా కాపాడుకొనుచు, "ఎలానైతేనేమి, నేనైతే ధర్మశాస్త్రమును గైకొన్నానని" వాడు తనతో తాను చెప్పుకొనవచ్చును.

**వచనము 22.** ఇటువంటి ఆలోచనా ధోరణికి భిన్నంగా, యేసు **నేను మీతో చెప్పునదేమనగా-తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగునని**

చెప్పాడు. నరహత్య చేయుట ద్వారా చేయబడిన పాపములో భౌతిక చర్య మాత్రమే కాదు, హృదయపు కోరిక కూడ చేరియున్నది, యివ్విధమైన ప్రకటనను యోహాను చేశాడు: "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకుని యందను నిత్యజీవముండదని మీరెరుగుదురు" (1 యోహాను 3:15).

కొన్ని గ్రీకు చేతి రాత ప్రతులలో "కోపము" యొక్క అర్థమును విశేషవంతము చేయుచున్న "నిర్నిమిత్తముగా" అను మాట, ప్రతి యొక్క నకలును రాయువాని చేత చేర్చబడినదని స్పష్టమగుచున్నది. వాక్యభాగము మధ్యలో ఈ విధంగా చేర్చుట వలన యేసు ఇచ్చిన సాహసపేతమైన తీర్పును అది మెత్తబరచినది. సహోదరుని యెడల కోపపడుటకు గల హేతువు కొన్ని పర్యాయములు సులభంగా తెలిసిపోతుంది, కానీ యేసు దీని గూర్చి ఆయన చూపించిన తారతమ్యములో ఎలాంటి న్యాయమని కనపరచు నిరూపణను ఇవ్వలేదు.

క్రొత్త నిబంధనలో రెండు రకములైన కోపములు వర్ణింపబడి యున్నవి. *Thumos* అను గ్రీకు పదము ఎంత శీఘ్రముగా రగులుకొంటుందో అంతే శీఘ్రముగా సమసిపోవునటువంటి కోపమును తెలియజేయుచున్నది. *Orgē* అను గ్రీకు పదము మనస్సులో పెంచబడుచు, తత్ఫలితమైన వాస్తవ లేదా ఊహించుకొనబడు గాయముల గూర్చియే తలపోయుచు దీర్ఘ కాలము నిలిచియుండునటువంటి కోపమును సూచించుచున్నది. స్పష్టంగా, యేసు రెండవ రకమైన కోపమును – క్షమించడు సరికదా, ఎన్నటికి మర్చిపోని కోపమును – నిషేధించుచుండెను. అది ఒకనిని అలాగే అంటిపట్టుకొని యుంటూ, సమాధానపరచబడుటకు నిరాకరించుచు పగతీర్చుకొను మార్గమును వెదుకుచునే యుండును. ఇవ్విధమైన కోపము దేవుని నీతిని నెరవేర్చదు (యాకోబు 1:20). "ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, బూతు మాటలతో కూడ" దానిని విసర్జించవలసినదే (కొలొస్సయులకు 3:8). క్రైస్తవులు ఇటువంటి కోపముతో నిదురించకూడదని పౌలు విన్నవించుకొన్నాడు (ఎఫెసీయులకు 4:26).

**తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహా సభకు లోనగును; మరియు ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగునని** పలుకుచు యేసు తన ఉపదేశమును కొనసాగించాడు. ఒకరొకరిని అపఖ్యాతిపాలుజేయు అవమానముతో కూడిన అభివ్యక్తములు అనవసరమును అనుచితమునై యున్నవని యేసు హెచ్చరించాడు. 2 రాజులు 2:23, 24లో పేర్కొనబడిన ఎలీషాను మరియు యూదుల బోధకులు చేయుచుండిన ఉపదేశములను ఉదాహరణంగా తీసుకొని, డోనాల్డ్ ఏ. హేగ్నర్ ఇలా రాసాడు, "ఇతరులను అవమానపరచు పేర్లతో వారిని పిలుచుట బైబిలు కాలములో ఎంతో ఎక్కువ గంభీరమైన విషయంగా పరిగణించబడింది, ఏలయనగా ఒకరి పేరునకు ఎంతో ఎక్కువ ప్రాముఖ్యత ఆరోపింపబడినది."[2] మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా చెప్పుచున్నాడు, "లేని పేర్లతో పిలుచుట యూదుల సంస్కృతిలో అత్యంత అవమానకరమైన పరిస్థితియై యుండినది, ఏలయనగా అలా పిలుచుట వలన ఒకని పేరునకు ఆపాదింపబడిన ప్రాముఖ్యత వాని నుండి నిర్వీర్యముచేయబడినదిగా ఎంచబడినది."[3]

"రాకా" (KJV; NIV – "వ్యర్థుడా") అను మాట అరమెయిక్ భాషా వ్యక్తీకరణమై యున్నది మరియు దాని సరైన అనువాదము సందేహాత్మకమైనదై యున్నది. "రాకా" అను మాట నానావిధములుగా అనువదింపబడినది: "ఎందుకూ పనికిరాని వాడు" (NASB), "బుద్ధిహీనుడు" (Phillips), మరియు "మెదడులేని మూర్ఖుడు" (AB). "రాకా" అను మాట

"మరొకనిని అత్యంత అసహ్యాభావముతో ద్వేషించువాని చేత ప్రయోగింపబడిన ఒక పలుకై యున్నది: హెబ్రీ రచయితలు ఈ పదమును అతి సామాన్యముగా ప్రయోగించుచుండిరి, మరియు అది దేశ ప్రజల నోట వెలువడిన అత్యంత సర్వసామాన్యమైన పదమై యుండినదని" జాన్ లైట్‌ఫుట్ చెప్పుచున్నాడు.[4] దురహంకారముతో కూడిన తిరస్కారమును – మాట ద్వారా మాత్రమే కాదు, కానీ మాట యొక్క స్వర ధోరణి ద్వారా కూడ ప్రదర్శింపబడిన దానిని – చూపించుటకు ఇది ప్రయోగింపబడిన ఒక పదమై యుండినది. దేవుని పోలిక చొప్పున సృజింపబడిన మరొక వ్యక్తి యెడల తృణీకారమును చూపించుట కంటె యేసు క్రీస్తు యెడల చేయు పాపము మరొకటిలేదు (యాకోబు 3:8–10; 1 యోహాను 4:20). ఖచ్చితంగా, క్రైస్తవుడు "ఇతరుల గూర్చి అతడు కలిగియున్న ఆలోచనలను, మరియు అట్టి ఆలోచనల వలన తలెత్తు మాటలతో సహా, వాని హృదయాంతరంగములోనికి చొచ్చుకొనిపోవు దేవుని సూక్ష్మ పరిశీలనకు అధీనము చేయుట వాని మీద విధిగా మోపబడిన కర్తవ్యమై యున్నది."[5]

మొరొన్ (moron) అను పదము ఉత్పన్నమైన "మూర్ఖుడు" (*mōros*) అను మాటకు, "నిర్హేతుకమైనవాడు," లేక "నైతికముగా ఏ మాత్రం విలువలేనివాడు" – స్వధర్మభ్రష్టుడు లేక విచక్షణా జ్ఞానములేని దుర్మార్గుడని అర్థము. అనగా అందులో లేక వానిలో ద్రోహచింతగల దురుద్దేశమున్నదని ధ్వనించుచున్నది. ఇటువంటి తీర్పు దేవునికి మాత్రమే చెందును, ఏలయనగా ఒకని హృదయమును ఆయన మాత్రమే ఎరుగును. మానసిక సామర్థ్యమునకును దీనికిని సంబంధము లేదు, కానీ అది ఒకని మంచి పేరును వాని నుండి తీసివేసి వానిని ఒక నిష్ప్రయోజకునిగా అనైతికమైనవానిగా ముద్రించుటయై యున్నది.

తీర్పునకు సంబంధించిన మూడు పదములను యేసు ప్రయోగించాడు, మరియు వాటి గాంభీర్యము అంతకంతకు అధిరోహించుచున్న క్రమములో వాటి ఉన్నత స్థానమునకు చేరుచున్నది. (1) కోపమునకు సంబంధించినంత వరకు, ఒకడు "మహా సభ" యెదుటికి వెళ్లును లేదా "తీర్పు"నకు లోనగును (NIV). నరహత్య గూర్చి చెప్పబడినప్పుడు 21వ వచనంలో ఇదే పదము ప్రయోగింపబడి యున్నది. అది స్థానిక న్యాయస్థానమును సూచించుచుండవచ్చును, గనుక యేసు చేసిన ప్రకటన దానికి అతిశయోక్తియై యుండును. ఎంతైనా, ఎప్పుడైనాగాని కోపము విషయంలో ఎంత మందికి తీర్పు తీర్చబడింది? మరొక సాధ్యత ఏమనగా, "మనస్సులో దేవుని తీర్పు"ను గూర్చిన తలంపు ఉండుట సాధ్యమే.[6]

(2) "వ్యర్థుడా" ("రాకా") అను పదమును ఉపయోగించుటకు సంబంధించినంత వరకు, ఒకడు "సర్వోచ్ఛ న్యాయస్థానము" యెదుట నిలువబడవలెను. ఈ పదము ఒక స్థానిక న్యాయస్థానమును సూచింపవచ్చును (10:17; మార్కు 13:9), కానీ అది సర్వసాధారణంగా యెరూషలేములో సమావేశమగుచుండిన సన్హెడ్రిన్ మహా సభకు నిర్దిష్టముగా ఉపయోగింపబడినది. సమాజంలో పలుకుబడి కలిగియుండిన డెబ్బైఒక్క మంది ఈ మహా సభలో సభ్యులై యుండిరి, వీరిలో ప్రధాన యాజకులు, పెద్దలు, మరియు శాస్త్రులుండిరి.

(3) "మూర్ఖుడు" (*mōros*) అను మాట "నరకాగ్ని" లోని దేవుని తీర్పు గూర్చి తెలియజెప్పుచున్నది. "నరకము" అను అర్థము గెహెన్న (*gehenna*) అను గ్రీకు పదము నుండి అనువదింపబడినది. యెరూషలేమునకు దక్షిణమున నున్న హిన్నోము లోయ నుండి గెహెన్న యొక్క ప్రతికృతి తలెత్తుచున్నది. ద్వేషింపదగు ఈ స్థలము అత్యంత అధమాధమమైన అవినీతిని, అన్యమతారాధికుల దేవత మొలెకునకు అర్పింపబడిన చిన్న పిల్లల బల్యర్పణల

గూర్చిన తలంపులను, యూదుల మనస్సుల్లో పుట్టించినది (2 దినవృత్తాంతములు 28:3; 33:6; యిర్మీయా 32:35). రాజైన యోషీయా ఈ స్థలమును అపవిత్రపరచాడు (2 రాజులు 23:10), మరియు అది “వధ లోయ” – బబులోనీయులు యూదుల శవములను పారవేయు ఒక స్థలము – ఔతుందని యిర్మీయా అటుతరువాత ప్రవచించాడు (యిర్మీయా 7:31–33; 19:6). హిన్నోము లోయ ఒక రోత చోటయ్యింది, ఒక చెత్తకుండీగా మారింది, అచ్చట అప్రయోజనమైన వస్తువులు నాశనము చేయబడినవి.[7]

పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన మధ్య కాలములో, ఈ చోటు శాశ్వతమైన, దారుణమైన శిక్షకు చిహ్నముగా మారినది – నరకమంటే, అదే, అగ్నికిని హిన్నోము లోయకును గల సంబంధము మూడు దిశలలో నుండి తలెత్తియుండవచ్చును: మొలెకు దేవతను ఆరాధించుచుండినప్పుడు మతారాధికులు మండుచుండిన మంటల నుండి, సాంప్రదాయ ప్రకారము ఎడతెరిపిలేకుండా కాల్చబడుచుండిన కడవరి చెత్తకుండీల మంటల నుండి, మరియు తీవ్రమైన తీర్పును ప్రస్తావించు పాత నిబంధన వాక్యభాగముల నుండి తలెత్తియుండవచ్చును (యెషయా 30:33; 33:14; 66:24).

తీవ్రమైన అక్కసుతో కూడిన మాటలు పలుకుచు క్రియలు చేయుట ద్వారా ఒక సహోదరుని లేక సహోదరిని నాశనము చేయువానికి ఏ శిక్షయైనను అత్యంత తీవ్రమైనది కాదని యేసు తన శిష్యులకు గుర్తు చేశాడు. “ఇతరులు అసత్య శిష్యులైయున్నారని నిందించినవారివలె మనస్సును గాయపరుచువారే తమ్మునుతాము శాశ్వతముగా నాశనము చేసికొనినవారై యున్నట్టు తెలిసికొందురని యేసు ఇచ్చిన అంతిమ హెచ్చరిక ధ్వనించుచుండినది.”[8]

**వచనములు 23, 24.** ఒక సమష్టి సూత్రమును ఇచ్చిన పిదప, యేసు రెండు అన్వయింపులను ప్రయోగించాడు. మొదటిదిగా, ఒకడు దేవుని ఆరాధింపక మునుపు వాడు తన **సహోదరునితో సమాధానపడవలసిన** ప్రాముఖ్యతను ఆయన నొక్కివక్కాణించాడు. ఒక సహోదరుని యెడల వారి హృదయములలో కలిగెడు చెడు ఆలోచనలకు లేక అతని గూర్చి చెడుగా మాటలాడుటకు ఆయన శిష్యులు ఆమడ దూరముండుట మాత్రమే కాదు, కానీ వారికిని ఇతరులకును మధ్య ఉండిన ఏ సమస్యలనైనను సరిదిద్దుటకు వారు నిర్మాణాత్మకమైన చర్యలను కూడ చేపట్టవలెను. ఇతరులతో సమాధానపడుటకు వారి మనస్సు నొప్పించినవాడు చొరవ చేసుకొనవలెనని ఇచ్చట చెప్పబడి యున్నది, అయితే ఇతరులతో సమాధానపడుటకు మనస్సు నొప్పింపబడినవాడే చొరవ చేసుకొనవలెనని మత్తయి 18:15–17లో చెప్పుచున్నది. ఇటువంటి సమస్యల గూర్చి చైతన్యవంతులై యుండియు ఎటువంటి చర్యనైనను చేపట్టని వ్యక్తులు మరియు భక్తులు, సాధారణంగా దోషులని నేరారోపణ చేయబడినవారై యున్నారు.

యేసు ఇచ్చుచున్న మార్గనిర్దేశనము యూదులు యెరూషలేము దేవాలయములో దేవునికి **అర్పించుచుండిన అర్పణల** వాడుకకు సంబంధించినదై యున్నది. ధర్మశాస్త్ర ప్రకారమైన బల్యర్పణలు ఒక పాపి వానికిని దేవునికిని నడుమ ఏర్పడిన ఉల్లంఘనమును సరిచేసికొనుటకు సరిపడిన సాధనములై యుండినవి. బల్యర్పణ తమంతటతాముగా, అవి పాపమునకు ప్రాయశ్చిత్తము కలుగజేయలేకపోయినవి (హెబ్రీయులకు 10:1–4 చూడుము); వాటితో పాటుగా యథార్థమైన పశ్చాత్తాపము మరియు ఒకని పాపము వలన ఏర్పడిన పరిణామములను ప్రతిశోధించు చిత్తశుద్ధితో కూడిన ఒక ప్రయత్నము కూడ చేయబడవలసి యుండినది. నైతిక వైఫల్యములకు శిష్టాచార సంబంధమైన బల్యర్పణలు ప్రత్యామ్నాయములై

యుండలేవని యేసు విదితముగా వివరించుచుండెను.

**అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట** వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుమను ఉత్తరువు కొంత అతిశయోక్తిగా ఉన్నట్లగుపించుచున్నది. "ఒక జత గువ్వలు లేదా సజీవముగా నున్న మేకపిల్ల మాట ఎలా ఉన్నా, ఒత్తిడులతో నిమగ్నమై యుండు బలిపీఠము నెదుట తృణధాన్య బల్యర్పణమైనను విడిచిపెట్టుట ఖచ్చితంగా సాధ్యంకాని పనియై యుండినది!"[9] సరికదా, అదే సమయంలో మనస్సు గాయపరచబడిన సహోదరుడు యెరూషలేము వరకు ప్రయాణం చేసి వచ్చియుండకపోవచ్చును. ఒకడు దేవునితో సత్సంబంధముగలవాడై యుండునట్లు వాడు తన సహోదరునితో సమాధాన పడవలసిన అవసరతను నొక్కివక్కాణించుటకు యేసు ఇటువంటి అతిశయోక్తిని ప్రయోగించాడు. "ఒక మనుష్యునికిని వాని తోటి సహోదరునికిని మధ్య నున్న ఉల్లంఘనల నిమిత్తము, వాడు తన సహోదరుని సౌహార్దమును సంపాదించుకొనినప్పుడు మాత్రమే, ప్రాయశ్చిత్తార్థ దినము వాని పాపమునకు ప్రాయశ్చిత్తము కలుగజేయునని" యూదీయ సాంప్రదాయము చెప్పుచుండినది.[10] "నీ బల్యర్పణ మాలిన్యముచేయబడకుండునట్లు, వారిరువురు ఒకరితో నొకరు సమాధానపడునంత వరకు వాని సహచరునితో కలహముగల ఎవరినైనను నీతో [మీ కూడికలో] చేరనియవద్దని" *Didache* (డిడాచి), ఆది క్రైస్తవ రచనలలో ఒకటి, తెలియజెప్పినది."[11]

**వచనములు 25, 26.** యేసు ప్రయోగించిన రెండవ అన్వయము, మనస్సు నొప్పింపబడినవాడు వాని యెడల తప్పిదము చేసినవానికి విరోధముగా చట్టపరమైన కార్యకలాపములను వాస్తవముగా మొదలుపెట్టిన ఒక పరిస్థితిని చిత్రీకరించినది. వారిరువరును న్యాయపీఠము యెదుటికి రాకమునుపే తన సహోదరుని మనస్సును గాయపరచినవాడు సమస్యను సరిదిద్దుకొనవలెనని యేసు సిఫారసు చేశాడు: **నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము.** పరిస్థితి యొక్క అత్యావశ్యకత నొక్కివక్కాణింపబడినది, ఏలయనగా సామరస్యముతో కూడిన సమాధానములగుండా, పరిస్థితి మరి ఎక్కువగా ఘోరమైనదౌతోంది. ప్రతికూలుడు (వాని ప్రతివాదిని) **న్యాయాధిపతికి అప్పగించును.** అప్పుడు వాడు దోషియని నిర్ధారణ చేయబడిన తరువాత, వాడు **బంట్రౌతుకు** అప్పగింపబడును గనుక చివరకు చెరసాలలో వేయబడును. వారి ప్రతి పట్టణములోను వారు "న్యాయాధిపతులను" మరియు "నాయకులను" నియామకము చేయవలెనని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆదేశములిచ్చాడు (ద్వితీయోపదేశకాండము 16:18). బంట్రౌతులు న్యాయాధిపతులిచ్చిన తీర్పును నిర్వహించారు.

ఈ సన్నివేశములోని సంకటస్థితిలో నున్న సమస్య ఆర్థిక సంబంధమైనదై యున్నది: **కడపటి కాసు చెల్లించువరకు అక్కడ నుండి నీవు వెలుపలికి రానేరవని నిశ్చయముగా చెప్పుచున్నాను.** "కాసు" (*kodrantēs*) అను పదము *quadrans* (క్వాడ్రాన్స్)ను అనగా రోమా ప్రభుత్వ నాణెములలో అత్యంత అల్పమైన విలువగల దానిని సూచించినది. దాని విలువలో అది విధవరాలి "రెండు కాసులకు" సమానమైనదై యుండెను (మార్కు 12:42; KJV). అప్పు చేసినవారిని చెరసాలలో వేయుట ప్రాచీన ప్రపంచములోని అన్యజనులలో ఒక సర్వసామాన్యమైన అభ్యాసమై యుండినది (18:34; లూకా 12:57–59). యూదీయ నేపథ్యంలో, అప్పులున్నవారు చెరసాలలో, అనగా వారు చేసిన అప్పులను

తిరిగి చెల్లించగలుగునట్లు డబ్బు సంపాదించుటకు ఎవ్విధమైన సౌకర్యం లేని స్థలములో, వేయబడుచుండిన అన్యజనుల కౄరమైన అభ్యాసము గూర్చిన ప్రస్తావన, ఒకడు అచ్చియున్న సొమ్మంతిటిని ఖచ్చితముగా చెల్లింపవలసి యుండిన ప్రాముఖ్యతను చూపించుటకు ఒక నిక్కచ్చియైన తీరై యుండినది. చిత్రీకరింపబడుచున్న తీర్పునకు సంబంధించినంత వరకు, అది శ్రోతల మనస్సుల్లో ఉద్దేశింపబడిన కార్య నెరవేర్పుకు ఒక హెచ్చరికను సమకూర్చుచుండినది.[12]

## వ్యభిచారము (5:27-30)

**27వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా; 28నేను మీతో చెప్పునదేమనగా ఒక స్త్రీని మోహపుచూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. 29నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల దాని పెరికి నీయొద్దనుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడవేయబడకుండ నీ అవయవములలో నొకటి నశించుట నీకు ప్రయోజనకరముగదా. 30నీ కుడిచెయ్యి నిన్నభ్యంతర పరచినయెడల దాని నరికి నీయొద్దనుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా.**

**వచనము 27.** శారీరక వ్యభిచార చర్య పాపిష్టియైనదై యుండినదను యూదీయ ఉపదేశమును యేసు సమర్థించాడు. యేసు ఉపదేశములను వినుచుండిన శ్రోతలు ఏడవ ఆజ్ఞతో సుపరిచితులై యుండవచ్చును: "వ్యభిచరించకూడదు" (నిర్గమకాండము 20:14; ద్వితీయోపదేశకాండము 5:18). మోషే ధర్మశాస్త్రము ప్రకారము పాపిష్టియైన కార్యమై యుండెను, క్రీస్తు నియమము ప్రకారము సహితము అది పాపిష్టియైన చర్యయే. పాత నిబంధన ప్రకారము వ్యభిచరించినవారు శారీరక మరణమునకు శిక్షార్హులై యుండిరి (లేవీకాండము 20:10; ద్వితీయోపదేశకాండము 22:22), మరియు నూతన నిబంధన ప్రకారము అది ఆధ్యాత్మిక మరణమునకు శిక్షార్హమైన చర్యయై యున్నది (1 కొరింథీయులకు 6:9, 10; ప్రకటన 21:8; 22:15).

**వచనము 28.** ఏదిఏమైనా, వ్యభిచరింపకూడదను ఆజ్ఞను పాత నిబంధన ఉద్ఘాటించిన దానిని మించి యేసు నొక్కివక్కాణించాడు: **నేను మీతో చెప్పునదేమనగా, ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును.** శారీరకముగా వ్యభిచరించుట పాపిష్టియైన చర్యయని చెప్పుచునే మోహము అనుమతించదగినదని యూదీయ బోధకులలో కొందరు పరిగణించుచుండగా, మోహమునకు ముందు వచ్చు తలంపూ సహితము పాపిష్టియైనదై యున్నదని యేసు ఘోషించాడు.[13]

యేసు వ్యతిరేకించినట్లే యూదీయ ఉపదేశకులలో ఇతరులు కూడ మోహమును వ్యతిరేకించుచుండిరి. ఉదా. "తన శరీరముతో వ్యభిచారము చేయువాడు మాత్రమే వ్యభిచారి యని పిలువబడునని మీరనుకొనుకూడదని అటుతరువాత అందుబాటులో ఉండిన ఒక మూలాధారము తెలియజెప్పుచున్నది. ఒకడు వాని కంటి చూపుతో వ్యభిచరించినట్లయితే, వాడు కూడ వ్యభిచారియని పిలువబడును."[14] ఈ హెచ్చరిక అపొక్రిఫలో (అప్రమాణిక గ్రంథములో) కనబడును: "అందమైన ఆకారమున్న ఆడదాన్ని నీ కన్నులు చూడకుండ వాటిని మరోక

వైపునకు దూరముగా త్రిప్పుకొనుము, మరియు మరొకరి అందచందముల వైపు అదేపనిగా తేరిచూడవద్దు; ఒక స్త్రీ యొక్క అందము చేత అనేకులు మరలుగొల్పబడియున్నారు, మరియు దాని మూలమున మంట వంటి ప్రగాఢావేశము రగులుకొల్పబడినది."[15]

మోహముతో కూడిన పాపము, ఇతర పాపముల వలెనే, దాని అంకుర దశలోనే అది తుంచివేయబడును. ఒక మోహపు చూపు ఒక మోహపు చర్యకు దారితీయును. "చూపులు" గూర్చి చెప్పుటకు ప్రయోగింపబడిన గ్రీకు పదము ఎడతెరిపిలేకుండా దృష్టిసారింపబడు ప్రక్రియను, ఉద్దేశపూర్వకముగా తదేక దృష్టి నిలుపుటను సూచించుచున్నది. దీనిలో మోహముతో కూడిన తదేక దృష్టి, వెర్రితలలు వేసిన కల్పన, ఊహల్లోనే అక్రమ సంబంధములలో మానసికంగా నిమగ్నమగుట కలవు (2 పేతురు 2:14; 1 యోహాను 2:16 చూడుము). ఒక స్త్రీ యొక్క అందచందాల గూర్చి ఒక పురుషుడు హర్షించుటను యేసు ఖండించుటలేదు. "ఈ సందర్భములో ఖండింపబడుచున్న విషయము ఒక పురుషుడు ఒక స్త్రీ యెడల కలిగియుండు స్వాభావికమైన వాంఛ కాదు, కానీ వానికి హక్కులేని స్త్రీ యెడల వాడు మోహముతో కూడిన దురాశను పెంచుకొనుట ఖండింపబడుచున్నది."[16]

పాత నిబంధనలోని వ్యభిచారమును గూర్చిన అతి ప్రాముఖ్యమైన ఉదాహరణము, దావీదు మరియు బత్షెబల కలయిక, బత్షెబ స్నానము చేయుచుండగా ఆమె వైపు దావీదు విసిరిన మోహపు చూపుతో మొదలయ్యింది (2 సమూయేలు 11:2–4). "నేను నా కన్నులతో నిబంధన చేసికొంటిని; కన్యకను నేనేలాగు చూచుదును?" అని నిందారహితుడైన యోబు ఒక పర్యాయము రూఢీగా పలికాడు (యోబు 31:1). ఇంకా, వివాహితయై యుండిన స్త్రీ చేత మరులుగొల్పబడుట నుండి ఆయన తన హృదయమును కాపాడుకొన్నాడనియు, లజ్జాకరమైన పరిస్థితులలో పడకుండా తనను తాను ఆపుజేసుకొన్నాడని కూడ ఆయన చెప్పాడు (యోబు 31:9–12).

మోహమనునది మానసికంగా మానభంగము చేయుటయై యున్నదని యేసు చెప్పిన మాటలు ధ్వనించుచున్నవి. మన స్వయం సంతృప్తి కోసం, అది మానసికంగా కావచ్చు లేదా భౌతికంగా కావచ్చు, మన ఇష్టము వచ్చినట్లు ఆడుకొనుటకు మానవులు ఆటవస్తువులు కారు. లైంగిక సంబంధమును దుర్వినియోగము చేయుట దేవుడు మనకనుగ్రహించిన వరములలో నొకదాని యెడల మనము ప్రదర్శించు కుటిలస్వభావమే ఔతుంది. లైంగిక సంబంధముల ద్వారా సంతరించుకొనబడవలసి సుఖసంతోషాలకు సంబంధిత దేవుని ఆజ్ఞలను సక్రమంగా అనుసరించుట ద్వారా మాత్రమే సంపూర్ణ ఆనందంతో అనుభూతిచెందవచ్చును.

**వచనములు 29, 30.** పాపము దాని మూలములోనే నిర్మూలింపబడవలెను. పాపము ఎంతో గంభీరమైన విషయమై యున్న హేతువునుబట్టి, మానసిక వ్యభిచారమును ఎలా నిరోధించవచ్చును? **"నీ కుడి కన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల దాని పెరికి నీ యొద్ద నుండి పారవేయమని"** యేసు చెప్పెను. రాబర్ట్ హెచ్. మౌన్స్ ఇలా చెప్పుచున్నాడు, "తొట్రిల్లుటను నిరోధించవలసిన కన్నే, ఒకడు తొట్రిల్లునట్లు చేయుటకు అడ్డుబండ [*skandalon*] యౌతొందనునది ఒక గంభీరమైన వక్రొక్తిగా ఉన్నది."[17]

సంఘము ఏర్పడిన ఆది దినములయందు, యేసు చేసిన ఘోషణ అప్పుడప్పుడు అక్షరార్థముగా తీసికొనబడినది. అదే విధముగా, ఓరిగెన్ (c. 185–254), "ఆది సంఘ పితామహులలో ఒకడు," మత్తయి 19:12లో రాయబడి యున్న యేసు క్రీస్తు ఉపదేశమును

ఆధారంగా చేసికొని దేవుని రాజ్యము నిమిత్తము తనును తాను ఒక నపుంసకునిగా చేసికొనెనని చెప్పుకొనబడుచున్నది.[18] ఏదిఏమైనా, యేసు స్వయం వికృతీకరణమును సమర్థించుట లేదు; తన మనస్సులోని మాటను అభివ్యక్తము చేయుటకు, ఆయన ఒక అతిశయోక్తిని ప్రయోగించుచుండెను. 29 మరియు 30వ వచనములలో ఆయన సమూల సంస్కరణ సంబంధమైన శస్త్రవైద్యమును ఆజ్ఞాపించుచుండలేదు, కానీ ఆయన అనుచరులు వారి జీవితములలో నున్న పాపమును తొలిగించుకొనవలెనని ఆయన ఉద్ఘాటించి చెప్పుచుండెను. వాటిని ఆధీనములో ఉంచుకొనుటకు మొగ్గుచూపు స్వాభావికమైన ప్రగాఢవేశములను అదుపుచేయునట్లు అవసరమై యుండు ఎటువంటి చర్యలనైనను చేపట్టుటకు గల అవశ్యకతను ఈ మనోకల్పన నొక్కివక్కాణించుచున్నది.[19]

**"నీ కుడి చెయ్యి నిన్ను అభ్యంతర పరచినయెడల, దాని నరికి నీ యొద్ద నుండి పారవేయుమని"** కూడ యేసు చెప్పాడు. "కన్ను" విషయములోను "చెయ్యి" విషయములోను, "కుడి" అని పేర్కొనబడుట గమించదగ్గ విషయమై యున్నది. కుడి చెయ్యి ఎక్కువ పెత్తనం చెలాయించునని ఎంచబడినందునుబట్టి, అదే అందరికి ప్రీతికరమైన చెయ్యియని భావింపబడినది. యేసు ఈ ప్రత్యేక పరిగణను కన్ను విషయములో కూడ వర్తింపజేసాడు.

ఈ మాటలలో గల ప్రాముఖ్యతను నొక్కివక్కాణించుటకు, యేసు ఇదే హెచ్చరికను రెండు పర్యాయములు ఇచ్చుచున్నాడు: "నీ దేహమంతయు నరకములో పడకుండ, నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా." యేసు మత్తయి 18:8లో కన్ను మరియు చెయ్యి మాత్రమే కాదు, కానీ పాదము కూడ కలిసియున్న ఇదే విధమైన ప్రకటనలు చేసాడు. ఈ వచనములో, "రెండు చేతులును రెండు పాదములను కలిగి నిత్యాగ్నిలో పడవేయబడుట కంటె, కుంటివాడవుగానో అంగహీనుడవుగానో జీవములో ప్రవేశించుట నీకు మేలు" అని ఆయన పలికిన మాటలు రాయబడి యున్నవి. "గోరంతలను కొండంతలు చేసి పలుకబడిన ఈ అతిశయోక్తి అధికంగా, అంగవైకల్యములు రానున్న లోకములో కూడ కొనసాగునా లేదా అని యూదుల బోధకులు చేయుచుండిన చర్చల దృష్ట్యా ప్రస్తావింపబడినదని" జాక్. పి. లూయిస్ ఆలోచించాడు.[20]

అటుతరువాత, సమస్త విధములైన పాపములు హృదయములో నుండి పుట్టునని యేసు చెప్పాడు (మత్తయి 15:18-20). కీలకమైన ఆలోచన హృదయమై యున్నది. సమస్య అనునది, ఒక స్త్రీని కేవలము మోహముతో చూచుట కాదని ఆయన మత్తయి 5:28లో చేసిన వ్యాఖ్యానములు రుజువుచేయుచున్నవి. అది కన్నుకు సంబంధించిన సమస్య కాదు, కానీ అది హృదయమునకు సంబంధించిన సమస్యయై యున్నది. మోహముతో కూడిన తదేక దృష్టి పాపము కాదు, కానీ హృదయములో అదివరకే తిష్టవేసికొనియున్న పాపము ఈ మోహపు చూపును కలుగజేయుచున్నది. ఒకడు యేసు ఆజ్ఞను అక్షరార్థముగా తీసికొన్నట్లయితే, వాడు మాములుగా కన్నును పెరికివేయుట లేదా చెయ్యిని నరికివేయుట కంటే తలనే నరికివేయుట అత్యంత అర్థసహితమైన అంశమై యుండును. ఒకని కన్నులు లేదా చేతులు వాడు తొట్రిల్లునట్లు చేసినట్లయితే, దుష్ట తలంపులను చెడు కోరికలను వాని మెదడు ఆపుజేయవలెనని వాడు దానికి ఆజ్ఞాపింపవలెను.

## విడాకులు (5:31, 32)

**[31]తన భార్యను విడనాడువాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యియ్యవలెనని చెప్పబడియున్నది గదా; [32]నేను మీతో చెప్పునదేమనగా – వ్యభిచారకారణమునుబట్టి గాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడినదానిని పెండ్లాండువాడు వ్యభిచరించుచున్నాడు.**

**వచనము 31.** విడాకుల గూర్చి మాటలాడుచు, ధర్మశాస్త్రము యొక్క స్ఫూర్తిని అలక్ష్యముచేసిన యూదీయ చట్టపరమైన అనువాదములతో యేసు మరొక పర్యాయము వ్యవహరించుచుండెను. చర్చింపబడుచున్న ఈ ప్రత్యేక ప్రశ్న ద్వితీయోపదేశకాండము 24:1–4 వచనములలో నుండి తీసికొనబడినది:

> "ఒకడు స్త్రీని పరిగ్రహించి ఆమెను పెండ్లిచేసికొనిన తరువాత ఆమెయందు మానభంగ సూచన ఏదో ఒకటి అతనికి కనబడినందున ఆమెమీద అతనికి ఇష్టము తప్పినయెడల, అతడు ఆమెకు పరిత్యాగ పత్రము రాయించి ఆమెచేతికిచ్చి తన యింటనుండి ఆమెను పంపివేయవలెను. ఆమె అతని యింటనుండి వెళ్లిన తరువాత ఆమె వేరొక పురుషుని పెండ్లి చేసికొనవచ్చును. ఆ రెండవ పురుషుడు ఆమెను ఒల్లక ఆమెకు పరిత్యాగ పత్రము రాయించి ఆమె చేతికిచ్చి తన యింటనుండి ఆమెను పంపివేసినయెడల నేమి, ఆమెను పెండ్లి చేసికొని పిమ్మట ఆ రెండవ పురుషుడు చనిపోయినయెడల నేమి ఆమెను పంపివేసిన ఆమె మొదటి పెనిమిటి ఆమెను పెండ్లి చేసికొనుటకై ఆమెను మరల పరిగ్రహింపకూడదు. ఏలయనగా ఆమె తన్ను అపవిత్రపరచుకొనెను, అది యెహోవా సన్నిధిని హేయము గనుక నీ దేవుడైన యెహోవా నీకు స్వాస్థ్యముగా ఇచ్చుచున్న దేశమునకు పాపము కలుగకుండునట్లు మీరు అలాగు చేయకూడదు."

ఈ వాక్యభాగము షరతులలో కూడిన వాక్యము యొక్క పొడిగింపై యున్నది. మొదటి మూడు వచనములలో "... అయినట్లయితే" అని అర్థమిచ్చు మాట (protasis, the "if" part) కలదు, నాలుగవ వచనములో "... అప్పుడు" అని అర్థమిచ్చు మాట (apodosis, the "then" part) కలదు.[21] అది విడాకులివ్వబడవలెనని చెప్పుచున్న ఒక *ఆజ్ఞ* కాదు, కానీ దానికి బదులుగా అది (అప్పటికే సమాజములో సంభవించుచుండిన) విడాకులకు సంబంధించిన ఒక నియమమై యున్నది. పరిత్యాగ పత్రిక పుచ్చుకొని మరలా వివాహము చేసికొనిన ఒక స్త్రీని తన మొదటి భర్త మరలా చేర్చుకొనకుండెను. క్రిస్టొఫర్ రైట్ మాటల్లో చెప్పదలచినట్లయితే, "దురదృష్టవంతురాలైన స్త్రీ, వైవాహిక ఫుట్‌బాల్ కాకుండునట్లు, అనగా బాధ్యతారహితులైన ఇరువురు పురుషుల నడుమ ఒక ఫుట్‌బాల్ వలె తన్నబడకుండునట్లు ఆమెను కాపాడుట ఈ నియమము యొక్క ఆచరణాత్మకమైన ప్రభావమై యున్నదని" చెప్పుకొనవచ్చును.[22] ఈ వాక్యభాగమునకు సంబంధించినంత వరకు, ప్రజల/పురుషుల హృదయాలు కఠినమైపోయి యుండుటవలననే మోషే విడాకులను *అనుమతించాడని* యేసు సెలవిచ్చుచుండెను (19:8).

**తన భార్యను తన యొద్ద నుండి దూరముగా పంపించు ప్రతివాడు, వాడు ఆమెకొక విడాకుల దృవపత్రము నియ్యవలెనని** చెప్పుకొనబడుచుండిన నానుడి ద్వితీయోపదేశకాండము 24:1ని ఆధారము చేసికొనినదై యున్నప్పటికిని, అది ప్రత్యక్షంగా

ఉల్లేఖించి పలుకబడిన ఉల్లేఖనము కాదు. ద్వితీయోపదేశకాండములోని వాక్యభాగములో, పరిత్యాగ పత్రిక ఇవ్వబడినదని భావింపబడుచున్నది, అయితే పరిత్యాగ పత్రిక ఇచ్చుట ఒక ఆజ్ఞయై యుండినది ఈ పలుకులు నివేదించుచున్నవి (మత్తయి 19:7).

"పరిత్యాగ పత్రిక," "తెగదెంపుల పత్రిక," "బహిష్కరణ పత్రిక," "ఒక దస్తావేజు," "ఒక తొలగింపు సాధనము," "వదలిపెట్టుచున్నట్లు తెలియజేయు ఉత్తరము" అని పిలువబడుచుండినది.[23] ఒక భర్త తన భార్యను హింసాత్మకమై ప్రవృత్తితో కూడిన ఆగ్రహావేశంలో తొందరపాటుతో దూరముగా పంపివేయకుండునట్లు పరిత్యాగ పత్రికలిచ్చు వాడుక నిరోధించినది. ఆమెను వ్యభిచారిణిగా పరిగణించుట నుండి కూడ ఒక భార్యను అది కాపాడినది గనుక ఆమె మరొక పురుషుని వివాహమాడుటకు స్వేచ్ఛగలదై యుండెను.

మొదటి శతాబ్దమునాటి యూదా మతములో వివాహ విచ్ఛిత్తి పురుషులకు ఒక విశిష్ఠాధికారమై యుండినది;[24] గనుక పురుషులు వారి భార్యలకు పరిత్యాగ ధృవపత్రికలు ఇచ్చినంతవరకు, వారు "ఏ హేతువుచేతనైనను" (19:3) వారి భార్యలకు పరిత్యాగ పత్రికలిచ్చినను వారు తరుచుగా సమర్థింపబడుచుండిరి. జోసీఫస్ ఇలా రాయుచున్నాడు,

> హేతువేదైనను (పురుషులు తెలియజెప్పుచుండిన అనేక హేతువులుండినవి) తన భార్య నుండి వివాహ విచ్ఛిన్నతను కోరుకొను భర్త, యిక మీదట ఆమెను ఎన్నడైనను, ఎట్టి పరిస్థితులలోనైనను తన భార్యగా ఉపయోగించుకొనడను అభయమును రాతమూలకంగా ఇయ్యవలెను; ఏలయనగా తద్వారా ఆమె మరొక పురుషుని వివాహమాడుటకు స్వేచ్ఛాపరురాలై యుండును.[25]

ఏదిఏమైనా, ఇట్టి మనస్తత్వంతో ప్రతి ఒక్కరు ఏకీభవించలేదు. రెండు యూదా మత బోధకుల సాంప్రదాయ వర్గములు ఈ విషయమే వేడిగా, వాడిగా చర్చలు నిర్వహించుచు, "అశ్లీల" అను పదము – ద్వితీయోపదేశకాండము 24:1లో పేర్కొనబడియున్నట్లు, అక్షరాలా "దిగంబరత్వము" – యొక్క అర్థము మీద వారి దృష్టిని కేంద్రీకరించారు.[26] యూదుల మతోపదేశకుడైన షమ్మాయి ఇంత కంటే ఎక్కువ బలమై యథాతథ సాంప్రదాయ దృక్పథము కలిగియుండి, "అశ్లీలత" అనగా దుశ్శీలమని చెప్పుచుండెను. ఏది ఏమైనా, అది సంపూర్ణమైన వ్యభిచారమై యుండదు, ఎందుచేతననగా దోషియైన పురుషుడు/స్త్రీ ధర్మశాస్త్ర నియమము ప్రకారము మరణ శిక్ష విధింపబడినవారై యుండును (లేవీయకాండము 20:10–14; ద్వితీయోపదేశకాండము 22:22). యూదుల మతోపదేశకుడైన హిల్లేల్ ఇంత కంటె ఎక్కువ విశాలమైన దృక్పథము కలిగియుండి, "అశ్లిలత" అనునది ప్రాథమికంగా భర్తకు అసంతృప్తి లేదా చికాకు కలుగజేయునది ఏదైనా – వంటలు సరిగా చేయకపోవుట కూడ – "అయి యుండవచ్చునని చెప్పుచుండెను."[27] అనుకొన్నట్లుగానే, హిల్లేలు కలిగియుండిన అతి విశాల దృక్పథముగల దృష్టికోణము అత్యధిక ప్రజాదరణ పొందినదై యుండెను.

**వచనము 32.** తన భార్యను విడనాడి, ఆమెను పంపివేయు పరుషుడు – అతడామెకు పరిత్యాగ పత్రిక ఇచ్చియుండినను – ఆమె పాపము చేయునట్లు చేయు విషయంలో బాధ్యుడై యున్నాడని యేసు సూచించాడు. **"నేను మీతో చెప్పునదేమనగా, వ్యభిచార కారణమునుబట్టి గాక, తన భార్యను విడనాడు ప్రతివాడు ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడినదానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడని"** ఆయన

సూటిగా తెలియజెప్పాడు. భర్తయైనవాడు "ఏ హేతువుచేతనైనను" తన భార్యను విడనాడుటకు స్వేచ్ఛగలవాడై యున్నాడను సంగతి ఎలా వున్నా భర్త తన వైవాహిక నిబంధన విషయంలో విశ్వసనీయమైన వాడై యుండుట అగత్యమై యున్నదనునది దానిని మించిన సత్యమై యున్నదని యేసు చెప్పాడు.

యేసు ఉపదేశము, షమ్మాయీయుల బోధలకు సమీపముగా నుండినది, అది యేసు దినములలో అభ్యసింపబడుచుండిన నియమము కంటె నిక్కచ్చియైనదై యుండెను. యేసు ఉద్దేశమంతా, వివాహము యొక్క పవిత్రత మరియు స్థిరత, దేవుడు వివాహ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పుడు తన మనస్సులో కలిగియుండిన మూల హేతువునకు సరిపడునదై యుండునట్లు పునరుద్ధరించుటయై యుండెను (ఆదికాండము 2:18-25; మలాకీ 2:13-16; మత్తయి 19:4-6, 9). హేగ్నర్ గుర్తించిన సత్యము యిలా వున్నది, "ఏదెను వనములోని ప్రమాణములకు తిరిగి చేరుకొనవలెనని రాజ్యపు నీతి యొక్క సమూల సంస్కరణ సంబంధమైన స్వభావము సాధికారంతో కోరుచున్నది."[28] వివాహ ఒప్పందము బంధించియుంచు స్వభావము కలిగియున్నదనియు, యేసు దానివైపే ఉన్ముఖుడై యుండెననియు డబ్ల్యూ. ఎఫ్. ఆల్‌బ్రైట్ మరియు సి. ఎస్. మాన్ సూచించారు:

> యేసు ఉద్ఘాటించి నుడువుచుండిన విషయము వివాహము యొక్క నియమము, దాని పునాదియై యున్నది, సూత్రప్రాయంగా, వివాహితయైన స్త్రీ పరిత్యాగ పత్రిక పుచ్చుకొనినను, ఆమె యింకను తన భర్త యొక్క భార్యయై యున్నది, గనుక ఆమె విడనాడబడినను మరలా వివాహము చేసుకొనునను ఊహగానమునుబట్టి తన భార్యను విడనాడువాడు ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు. పరిత్యాగ పత్రిక పుచ్చుకొనిన స్త్రీని వివాహమాడు పురుషుడు ఆమెతో వ్యభిచరించుచున్నవాడుగాను, తనకు తానే నేరముచేయుచున్నవానిగాను పరిగణింపబడును, ఏలయనగా సూత్రప్రాయంగ - అది చట్టపరమైనది కానప్పటికిని - విడాకులివ్వబడిన స్త్రీ యింకను తన మొదటి భర్తతో వివాహమైనదిగానే నిలిచియుండును.[29]

ఇటువంటి సందర్భములలో విడాకులివ్వబడిన స్త్రీ ఎలాగైనా సరే మరలా వివాహము చేసికొనునని యేసు భావించుచుండెను ఏలయనగా మెదటి శతాబ్దపు సంస్కృతిలో ఒక స్త్రీ తానొక్కత్తే స్వయాన ఒంటరిగా జీవించుట అత్యంత తీవ్రముగా కష్టమైన పరిస్థితియై యుండెను.

ఏదిఏమైనా, సాధారణ నియమమునకు యేసు ఒక మినహాయింపు ఇచ్చాడు: **వ్యభిచారము నిమిత్తమే తప్ప** (చూడుము 19:9). "వ్యభిచారము" అను పదము పోర్నియ (*porneia*) అను గ్రీకు పదము నుండి ఉత్పన్నమైనది, అది "జారత్వము" (KJV) మరియు "వైవాహిక విశ్వాసఘాతుకము" (NIV) అని కూడ అనువదింపబడినది. ఈ సందర్భములో, ప్రతి విధమైన న్యాయసమ్మతముకాని లైంగిక సంబంధమైన సంభోగమును ఒక ఛత్రము క్రిందకు తెచ్చునట్లు ఈ పదము ప్రయోగింపబడినది. తన భార్య యొక్క వ్యభిచారమునుబట్టి పురుషుడు ఆమెను విడనాడినట్లయితే అతడు దోషి కాడనునది అసలు విషయమై యున్నది.[30] ఈ వినాయింపునకు సంబంధించిన ఉపవాక్యము, విశ్వాసఘాతుకులైన వారి భార్యలను విడనాడునట్లు అది పురుషులకు అనుమతినిచ్చినది కానీ వారు అలా చేయవలెనని ఆజ్ఞాపించలేదు. బహూశా స్త్రీ పొందిన మారుమనస్సు, పురుషుడు ఆమె యెడల చూపించిన క్షమాపణతో పాటు, వారి వైవాహిక దాంపత్య జీవితము పునరుద్ధరింపబడుటకు తావిచ్చినది.

దీనికి తారతమ్యముగా, యూదా మతోపదేశకుల నియమము ప్రకారము, పురుషుడు విశ్వాసఘాతుకరాలైన తన భార్యను విడనాడవలసినదే ఏలయనగా అట్టి పరిస్థితులలో ఆమె అపవిత్రమైనదగా పరిగణింపబడినది.[31]

ఈ వాక్యభాగములో మరియు సంబంధిత సమానంతరములలోను (19:1-12; మార్కు 10:1-12; లూకా 16:18), యేసు విడాకులకు వ్యతిరేకముగా బోధించుచుండెను. ఏదిఏమైనా, 1 కొరింథీయులకు 7 అధ్యాయంలో పౌలు చేత ప్రతిపాదింపబడిన కొన్ని విషయాలను యేసు సుస్పష్టముగా చర్చించలేదు లేక విశదీకరించలేదు.

## ఒట్టుపెట్టుకొనుట (5:33-37)

**[33]మరియు-నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, [34]నేను మీతో చెప్పునదేమనగా - ఎంతమాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు; ఆకాశము తోడన వద్దు; అది దేవుని సింహాసనము, [35]భూమి తోడన వద్దు, అది ఆయన పాదపీఠము, యెరూషలేముతోడన వద్దు; అది మహారాజు పట్టణము. [36]నీ తలతోడని ఒట్టుపెట్టుకొనవద్దు, నీవు ఒక వెంట్రుకనైనను తెలుపుగా గాని నలుపుగా గాని చేయలేవు. [37]మీ మాట అవుననంటే అవును, కాదంటే కాదు అని యుండవలెను; వీటికి మించునది దుష్టునినుండి పుట్టునది.**

**వచనము 33.** 21వ వచనంలోగల సంపూర్ణమైన సూత్రముతో ఒట్టుపెట్టుకొనుటకు సంబంధించిన ఈ బోధను యేసు పరిచయము చేసాడు: **మరియు ... అని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా,** నిర్దిష్టమైన ఒక పాత నిబంధన వాక్యభాగములో నుండి ఉల్లేఖించి చెప్పుటకు బదులుగా, ఆయన దాని ఉపదేశమును ఈ క్రింది విధంగా క్లుప్తీకరించాడు: **నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెను.** ధర్మశాస్త్రము కొన్ని పరిస్థితుల ననుసరించి సమస్త ఒట్టులను మరియు ప్రమాణములను ఖండించలేదు, కానీ అబద్ధ ప్రమాణములను మాత్రమే ఖండించినది. వాస్తవమునకు కొన్ని నిర్దిష్టమైన పరిస్థితులలో అది ప్రమాణములను కోరినది (నిర్గమకాండము 22:10-13; సంఖ్యాకాండము 5:16-22). ఇంతేగాక, అన్యదేవతల నామములో కంటే, దానికి బదులుగా వారు దేవుని నామములో ఒట్టుపెట్టుకొనవలెనని అది ప్రజలకు ఆజ్ఞాపించినది (ద్వితీయోపదేశకాండము 6:13, 14; 10:20). ఏదిఏమైనా, అబద్ధముగా ఒట్టు పెట్టుకొనుట ప్రమాణములు చేయువారి విషయంలో ధర్మశాస్త్రము బహూ భయంకరమైన పర్యవసానములను ప్రకటించినది, ఏలయనగా అది దేవుని నామమును వ్యర్థముగా ఉచ్చరించుటతో సమానమైనదిగా ఎంచబడినది (నిర్గమకాండము 20:7, 16; లేవీయకాండము 19:11, 12; సంఖ్యాకాండము 30:2; ద్వితీయోపదేశకాండము 5:11; 19:15-20; 23:21-23).

**వచనములు 34, 35.** యేసు, మరొక పర్యాయము బహుశా కొంత అతిశయోక్తితోనే అయినా, సమస్త ప్రమాణములను నిషేధించాడు: **"నేను మీతో చెప్పునదేమనగా, ఎంతమాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు."** యేసు దినములలో జీవించుచుండిన యూదులు దేవుని నామమును ఉపయోగించుటకు దూరముగా నుండిరి, కానీ వారు **ఆకాశము**, **భూమి**,

**యెరూషలేము**, దేవాలయము, దేవాలయములోని బంగారము, బలిపీఠము, బలిపీఠముపై నున్న బల్యర్పణ, బలిపీఠముపై ఉపయోగింపబడు పాత్రలు, మరియు ఇటువంటి ఇతర వస్తువుల పేరట ఒట్టుపెట్టుకొనుచుండిరి.[32] ఏదిఏమైనా, ఈ ప్రమాణములన్నింటిని పాటించునట్లు వారు బలవంతము చేయబడుచున్నారని వారు నమ్మలేదు. మత్తయి 23:16–22 ప్రకారము, దేవాలయములోని బంగారము లేక బలిపీఠముల నామమున ఒట్టుపెట్టుకొనువాడు బద్ధుడైయుండును, కానీ వాడు దేవుని మీద (అదోనాయ్ – "ప్రభువైన దేవుడు," "యాహ్వే – యెహోవా దేవుడు," లేక "సర్వశక్తిమంతుడైన దేవుడు" అని) లేదా దేవునికి సంబంధించిన ఏదైనా శిష్టోక్తితో ("కృపాకనికరములుగలవాడు" వంటి మాటలతో) ఒట్టుపెట్టుకొన్నట్లయితే బద్ధుడై యుండును.[33]

సమస్త ప్రమాణములు కట్టుబడి యుండవలసినవై యున్నవని రూఢిపర్చుచు, యేసు ఇటువంటి అభ్యాసములలో నెలకొనియుండిన వేషధారణను మరియు వంచనను బహిరంగముగా నిరసించాడు. యూదులు ఒట్టుపెట్టుకొనుచుండిరి కానీ ఎల్లప్పుడు దేవుని నామములో ఒట్టుపెట్టుకొనలేదు, వారు ఆయనకు అత్యంత సన్నిహితముగా నున్న విషయములతో ఒట్టుపెట్టుకొనుచుండిరి. "ఆకాశము" **దేవుని సింహాసనమై** యున్నది, మరియు "భూమి" **ఆయన పాదపీఠమై** యున్నది (యెషయా 66:1). అంతమాత్రమేగాక, "యెరూషలేము" **మహారాజ పట్టణమై** యున్నది (కీర్తనల 48:2), మరియు "దేవాలయము" ఆయన నివసించు చోటై యున్నది (మత్తయి 23:21). వారు ప్రమాణములను ఉల్లఘించుచు, పరోక్షంగా దేవుని నామమును వాస్తవముగా దూషించుచుండిరి.

**వచనము 36.** అవరోహణ క్రమము (ఆకాశము, భూమి, యెరూషలేము) ఒక్క వ్యక్తితో ముగియుచున్నది: **నీ తల తోడని ఒట్టుపెట్టుకొనవద్దు.** "నీ తల జీవము తోడని" ఒట్టుపెట్టుకొనుట గూర్చి మిష్నా పేర్కొనుచున్నది, గనుక దానిని ఉపసంహరింపవచ్చునో లేదో యని యూదా మత బోధకులు వాదోపవాదములు చేశారు.[34] మానవుని బలహీనతనుబట్టి ఇటువంటి ప్రమాణములలో ఉండిన మూర్ఖత్వమును యేసు గమనించాడు: **"నీవు ఒక వెండ్రుకనైనను తెలుపగా గాని నలుపుగా గాని చేయలేవు."** దీనికి తారతమ్యముగా, సమస్త మానవాళిని దేవుడు తన సార్వభౌమాధికారముతో తన ఆధీనములో ఉంచుకొనుచున్నాడు, ఆయన ఒకని తలవెంట్రుకల సంఖ్యను సహితము ఎరిగియున్నాడు (మత్తయి 10:30).

**వచనము 37. మీ మాట అవునంటే, అవును కాదంటే, కాదు అని యుండవలెనని** పలుకుచు యేసు తన శిష్యులను మందలించాడు. NIV అనువాదములో, "మామూలుగా 'ఔనంటే' 'ఔను,' 'కాదంటే' 'కాదు' అయియుండవలెనని" రాయబడియున్నది. వారు సామాన్యముగాను సత్యముతోను, సమాధానములు చెప్పుచుండవలెనని యేసు తన శిష్యులకు ఆదేశించుచుండెను (2 కొరింథీయులకు 1:17–24; యాకోబు 5:12 చూడుము). ఒకడు ఎల్లప్పుడు సత్యమునే పలుకుచున్నట్లయితే, ఒట్టుపెట్టుకొనవలసిన అగత్యమే లేదు.

ఒట్టుపెట్టుకొనుట మరియు ప్రమాణములు చేయుట గూర్చి యేసు కలిగియుండిన వైఖరిని ఎస్సేనీయుల చేత పంచుకొనబడినది. వారి గూర్చి జోసీఫస్ ఇలా రాయుచున్నాడు,

> స్వామిభక్తి విడువని విషయంలో వారు ప్రముఖులై యున్నారు, గనుక వారు సమాధానమునకు పరిచారకులై యున్నారు; వారు చెప్పుచుండు సమస్తము అదేదైనను అది ఒట్టుపెట్టుకొనుట కంటే కూడ అత్యంత స్థిరమైనదై యుండెను; కానీ వారు ప్రమాణములు చేయుటకు దూరముగా

> నుండిరి, గనుక వారు దానిని కూటసాక్ష్యము కంటె ఘోరమైనదానిగా ఆదరించుదురు; ఏలయనగా దేవుని మీద ఒట్టుపెట్టుకొనకుండా నమ్మదగినవాడై యుండనివాడు, అదివరకే ఖండింపబడియున్నాడని వారు చెప్పుదురు.[35]

ఏదిఏమైనా, ఏస్సేనీయుల వర్గములోనికి చేర్చుకొనబడినవారు "దేవుని యెడల గల ధార్మిక చింతన" మరియు "సాటి మానవుల యెడల గల న్యాయమునకు" సంబంధించినంత వరకు వారు "ప్రచండమైన ప్రమాణములు" చేయవలసినవారై యుండిరి.[36]

"వీటికి [మామూలు మాట "ఔను" లేక "కాదు"] మించునది కీడు నుండి పుట్టునదని" యేసు చెప్పెను. "కీడు" అను గ్రీకు విశేషణము స్వతంత్ర ప్రతిపత్తితో "దుష్టుని" అని అర్థం చేసికొనవచ్చును (మత్తయి 5:37; 6:13; 13:19, 38; NIV). యూదులు వంచనతో ఒట్టుపెట్టుకొనుట దుష్టుని నుండి పుట్టినది, ఈ దుష్టుడు "అబద్ధమునకు జనకుడునై" యున్నాడు (యోహాను 8:44). ఆయన శిష్యులు తండ్రి యొక్క నైతిక న్యాయవర్తమును పోలి నడుచుకొనవలెనని యేసు కోరుచుండెను (మత్తయి 5:48). ఇంతేగాక, వారు యేసుననే, "సత్యము" అని వర్ణింపబడిన వానినే (యోహాను 14:6), "ఆయన నోట ఏ కపటమును కనబడనివానినే" (1 పేతురు 2:22) వెంబడించవలసినవారై యున్నారు.

యేసు ఒట్టుపెట్టుకొనుటను నిర్దిష్టమైనదాని కంటే ఒక సమష్టి నియమముగా నిషేధించుచుండెనా? యేసు బోధలు వినుచుండినవారి హృదయములపై చెరగని ముద్రవేయుచుండునట్లు మత్తయి 5:34, 37లో నున్న యేసు ప్రకటనలు అతిశయోక్తులై యుండవచ్చును. ఎంతైనా, ఒట్టుపెట్టుకొనుట గూర్చి ప్రస్తావించిన ప్రధాన యాజకునికి క్రీస్తు సరైనా సమాధానమిచ్చాడని సూచించబడుచున్నది ("జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాను"; 26:63, 64). సత్యసంధత్వముతో కూడిన ప్రమాణములు అతనికివ్వబడిన ప్రేరణతో పౌలు రచించిన పత్రికలలో మనకు కనబడును (రోమీయులకు 1:9, 10; 1 కొరింథీయులకు 15:31; 2 కొరింథీయులకు 1:23; గలతీయులకు 1:20; ఫిలిప్పీయులకు 1:8; 1 థెస్సలొనీకయులకు 5:27). దేవుడు ఒట్టుపెట్టుకొన్నాడని హెబ్రీ పత్రిక రచయిత ప్రకటించాడు (హెబ్రీయులకు 6:17, 18).

## పగతీర్చుకొనుట (5:38–42)

**38కంటికి కన్ను పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు కదా. 39నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడిచెంపమీద కొట్టువాని వైపునకు ఎడమ చెంపకూడ త్రిప్పుము. 40ఎవడైన నీ మీద వాజ్యెము వేసి నీ అంగీ తీసుకొనగోరిన యెడల వానికి నీ పైవస్త్రము కూడ ఇచ్చివేయుము. 41ఒకడు ఒక మైలుదూరము రమ్మని నిన్ను బలవంతము చేసినయెడల, వానితో కూడ రెండు మైళ్లు వెళ్లుము. 42నిన్ను అడుగు వానికిమ్ము, నిన్ను అప్పు అడుగ గోరువానినుండి నీ ముఖము త్రిప్పు కొనవద్దు.**

**వచనము 38.** యేసు యిచ్చట ఉపయోగించిన ఉల్లేఖనము – **కంటికి కన్ను, పంటికి పన్ను** – పాత నిబంధనలో నుండి తీసికొనబడినది (నిర్గమకాండము 21:23, 24; లేవీయకాండము 24:20; ద్వితీయోపదేశకాండము 19:21). అదితరచుగా ప్రతీకార ధర్మము

(*lex talionis*) అని ప్రస్తావించబడినది. ఇవ్విధమైన చట్టమ హమ్మురాబీ,[37] బబులోను రాజ్యములో (c. 1800) ప్రసిద్ధికెక్కిన రాజు. అది అటవికమైనదిగాను, క్రూరమైనదిగాను అగుపించవచ్చును, కానీ వాస్తవమునకు అది కనికరముతో కూడిన నియమమైయుండినది. మొదటిగా, ఒకడు తగినదానికి మించిన శిక్షకు గురికాకుండునట్టు అది నిరోధించినది. రెండవదిగా, న్యాయసమ్మతమైన అధికారము లేకుండానే ఊరు మీద ఊరకనే తిరుగుచుండు మూక వారి దృష్టి సరైనదనిపించిన "న్యాయమును" తీర్చకుండునట్లు అది నిరోధించినది (లేవీయకాండము 19:18; సామెతలు 20:22; 24:29). మోషే ధర్మశాస్త్రములో, ప్రతికారము తీర్చుకొనుట న్యాయపరమైన పాలనకు పరిమితము చేయబడినదై యుండెను. చట్టపరంగా సరైన కాపుదలలతో, తీర్మానములు బహిరంగముగా చేయబడినవి (ద్వితీయోపదేశకాండము 19:15–21). ఒకనికి శిక్ష విధింపబడక మునుపు వాని మీద మోపబడు ఆరోపణల గూర్చిన వాంగ్మూలములను దృఢపర్చుటకు ఇద్దరు సాక్షులు అందుబాటులో ఉండవలసిన అవసరముండినది (ద్వితీయోపదేశకాండము 17:6). మూడవదిగా, చేయబడిన నేరమునకు తగిన శిక్ష విధింపబడునట్లు ఇటువంటి నియమములు అనుమతించినవి.

మానవాళికి మంచిచేయునదై యుండవలెనని దేవుడు ఉద్దేశించిన వాటిని శాస్త్రులు మరియు పరిసయ్యులు తీసికొని వాటిని కీడు కలిగించువాటిగా చేసారు. ధర్మశాస్త్రమును కాపుదల నిమిత్తము ఉపయోగించుటకు బదులుగా, అది వారి శత్రువుల యెడల పగతీర్చుకొనుటకు సానుకూలమైనదై యుండునట్లు దానిని సరైన మార్గము నుండి తప్పించి కుటిలత్వముతో సమర్థించారు. ఇట్టి కుటిల స్వభావము మానవుడు పగతీర్చుకొను పద్దతులను వెదకు సహజ ప్రవృత్తికి విచ్చలవిడితనమును సమకూర్చినది. దేవుడు ఆయన ప్రజలపై ఉంచిన నియంత్రణ లేకుండినట్లయితే, వారు అనేక మంది అమాయకులను అనవసరంగా ఉరితీయుచుండెడివారే. గనుక యేసు ఈ నియమము తప్పు దారి పట్టింపబడుచుండిన విషయముతో వ్యవహరించుట మాత్రమే కాదు, కానీ దేవుని మూలోద్దేశము యొక్క ఆధ్యాత్మిక కోణమును కూడ చూపించాడు. కసితీర్చుకొనుటకు మానవునిలో గల సహజ ప్రవృత్తిని వారు ఎదిరించుచు, "మేలుచేత కీడును జయించవలెనని" ఆయన తన శిష్యులకు నేర్పించాడు (రోమీయులకు 12:21 చూడుము). ఎంతైనా, పగతీర్చుకొనుట, అది దేవుడే చూచుకొను విషయమై యున్నది (రోమీయులకు 12:19; హెబ్రీయులకు 10:30).

క్రీస్తు కాలము వచ్చునాటికి, ఈ నియమము అక్షరాలా బహూ అరుదుగా అన్వయింపబడినది. కీడుకు ప్రతికీడుగా ప్రజలు వారి శత్రువు యొక్క పళ్లు రాలగొట్టలేదు లేదా కళ్లను పెరికివేయలేదు. సంప్రదింపుల ద్వారా సరైన మొత్తమును చెల్లించు ఒక పద్ధతి ప్రవేశపెట్టబడినది, గనుక దాని వలన ఒక కన్ను లేదా పన్ను విలువను న్యాయాధిపతి నిర్ణయించును.[38] ఒక కన్ను ఖరీదు ఒక సంవత్సరములో లేదా అంతకంటే ఎక్కువ కాలములో సంపాదింపబడు జీతమును సరిపడునదై యుండవచ్చును, అలాగే ఒక పన్ను వెల కొన్ని కుంచముల గోధుమల వెలకు సరిపడునదై యుండవచ్చును. ఇది ప్రమాదములు సంభవించినప్పుడు, ఆధునిక న్యాయస్థానములు వ్యక్తిగత గాయముల గూర్చిన విషయములతో వ్యవహరించుచు, నష్టపరిహారమును మదింపు చేయుచు, చెల్లింపబడవలెనని తీర్పు ఇచ్చుటకు పాటింపబడుచున్న ప్రస్తుత విధానము వంటిదై యున్నది. ఏదిఏమైనా, అనేక సందర్భములలో, న్యాయ విచారణ పద్ధతలను ప్రజలు దుర్వినియోగము చేయుచు సరిగ్గా

యేసు నిషేధించినదానినే చేయుటకు పూనుకొన్నారు: ప్రతిఫలం చెల్లింపుల పద్ధతిని. ప్రజలు పగతీర్చుకొనుటకే వెదుకుచున్నారు. లేదా సహేతుకమైనదానికంటే అధిక ప్రతిఫలమును సాధికారంతో అడుగుచున్నారు. ప్రతీకారము తీర్చుకొను ప్రక్రియ వారి స్వలాభానికి ఉపయోగపడునట్లు ప్రజలు దానిని మల్చుకొనుచున్నారు గనుక ఆర్థిక ప్రతిఫల చెల్లింపులకు సంబంధించిన సూత్రము వారికి సానుకూలంగా ఉండునట్లు మార్చబడినది.

**వచనము 39. దుష్టుడైన వానిని ఎదిరింపవద్దు** అని యేసు సెలవిచ్చిన ఆజ్ఞ "న్యాయము వెదక వద్దు" అను దానికి సమానమైనది కాదు. ఈ ప్రకటన ఆయన చేసిన ఆది వ్యాఖ్యానముల సందర్భమునకు ఎదురుగా యోచింపబడవలెను. "ఎదిరించుట" అని సమానార్థమిచ్చు గ్రీకు పదము ఒక దుష్టుని చేత వారికి చేయబడిన హాని విషయము శిష్యులు వ్యక్తము చేసిన వ్యతిరేకతను సూచించుచున్నది. వ్యక్తిగతముగా చేయబడిన గాయముతో ఎల వ్యవహరించవలెనో, కక్ష సాధింపులు, ద్వేషము, మరియు అనిష్టమునకు ఎలా దూరముగా ఉండవలెనో, యేసు ఆదేశములు సరైన సమాధానములను తెలియజెప్పుచున్నవి. అలాగని, ఆయన తానే అనేక సందర్భములలో వ్యతిరేకించినట్లు (21:12; యోహాను 2:15), మనము అన్యాయమునకు వ్యతిరేకముగా మన నోరు విప్పకూడదని ఆయన నిశ్చయముగా బావించలేదు. "అపవాదిని ఎదిరించుడని" యాకోబు చెప్పాడు (యాకోబు 4:7); కాబట్టి, దుష్టుడు చొరవతీసికొను చెడు ఏదైనను మనము దానిని ఎదిరించవలసినవారమై యున్నాము (6:13; రోమీయులకు 12:9; 1 థెస్సలొనీకయులకు 5:22; 2 తిమోతి 4:18). యేసు క్రీస్తును వెంబడించువారు దుష్టుడైనవానిని ఎదిరింపపలసినదేయని జాన్ మెక్ఆర్థర్ జూనియర్ భావించాడు:

> చెడును నిర్బంధించకపోవుట న్యాయసమ్మతమైనదిగాని దయగల చర్యగాని కాదు. అలా చేయునప్పుడు అమాయకులను కాపాడుటలో అది విఫలమైనట్లే మరియు అది దుష్టులను వారి దుర్మార్గపు పనులలో ప్రోత్సాహించు ప్రభావము చూపుతుంది. ఏదిఏమైనా, చెడును నిర్బంధించుట, న్యాయసమ్మతమైనది మాత్రమే కాదు, కానీ అది అందరికి హితకారియౌతోంది. …
>
> దేవుని న్యాయ ప్రమాణముల విలువను తగ్గించుట, ఆయన నీతి ప్రమాణమును తగ్గించుట యౌతోంది – యేసు క్రీస్తు ఈ ప్రమాణమును అనవసరమనిపించుటకు లేదా తక్కువచేయుటకు కాదు, కానీ దానిని నెరవేర్చుచు సుస్పష్టము చేయుటకు ఈ లోకమునకు అరుదెంచాడు.[39]

యేసు వ్యక్తిగతముగా పగతీర్చుకొనుటకు వ్యతిరేకముగా ప్రాథమిక సూత్రమును ఏర్పాటు చేసిన తరువాత, అక్రమమైన అభిచర్యలను సోదాహరణంగా చిత్రీకరించుటకు ఆయన ఐదు సంఘటనలను వర్ణించాడు. మొదటి చర్య, శారీరక దౌర్జన్యమునకు సంబంధించినది: **నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము.** మనము ఎవరైనా ఒకరిని పిడికిలితో వాని ముఖములో కొట్టుట గూర్చి ఆయన సూచింపలేదు; దానికి బదులుగా, ఒకని ముఖమును చేతి వెనుక భాగముతో నెమ్మదిగా లేక మామూలుగా కొట్టుట గూర్చి ఆయన సూచింపలేదు; దానికి బదులుగా, ఈ ప్రక్రియను అత్యంత అవమానకరమైన విషయముగా పరిగణించారు (యోబు 16:10; విలాపవాక్యములు 3:30; మత్తయి 26:67, 68; మార్కు 14:65; యోహాను 18:22; 2

కొరింథీయులకు 11:20 చూడుము). నిశ్చయముగా, చెంప దెబ్బ కొట్టబడుట అవతలి వ్యక్తిని కించపరచుచు వానిని అగౌరవపరచడమే ఔతుంది యూదులు శాసనము ప్రకారము, ఒకడు వాని ప్రత్యర్థిచేత వాని ముఖము మీద వాని అరచేతితో లేదా పిడకిలితో కొట్టబడినప్పుడు చెల్లింపబడిన నష్టపరిహారము వలెనే, ఒకని చేతి వెనుక భాగముతో మరొకని ముఖము మీద కొట్టబడినప్పుడు, వానికి రెట్టింపు నష్టపరిహారము చెల్లింపబడినది.[40]

ముఖము మీద కొట్టబడుట ద్వారా అనుభవించిన అవమానమునకు విరోధముగా మనము పగతీర్చుకొనుటకు బదులుగా, కొట్టినవాని వైపు రెండవ చెంపను కూడ త్రిప్పవలెనని యేసు ఉద్బోధించాడు. వెనుదిరిగి పెళ్లుమనిపించుటయే, చెంప మీద కొట్టబడినప్పుడు చెలరేగే స్వాభావికమైన ప్రతిస్పందనయై యున్నప్పటికిని, ఆ విధముగా స్పందించకూడదని యేసు ఆదేశించాడు. యేసు సూచించుచున్న ఈ ప్రతిస్పందన సాత్వికము మరియు వినయముతో కూడిన స్ఫూర్తిగల విధానమును పాటించుటయై యున్నది, మరియు ఆయనను వెంబడించుచుండినవారికి ఈ విషయాన్ని ఆయన అదివరకే సూచనప్రాయంగా సూచించాడు. రెండవ చెంపను కూడ త్రిప్పుట, త్రిప్పిన వాని అమాయకత్వమును, మరియు వాని ఉదార స్వభావముగల వైఖరిని ప్రదర్శించును. గాయపరచకుండుట లేదా అవమానపరచకుండుట ద్వారా ఒకని శీలము యొక్క గౌరవము మరియు బలము ఎంత గొప్పదో ప్రదర్శింపబడును. మన యెడల చేయబడు అక్రమ అభిచర్యలకు మనము దయతో ప్రతిస్పందించినప్పుడు, మనకు కీడుచేసిన వాని "తల మీద నిప్పులు కుప్పగా పోసినవారమౌదుమని" పౌలు సెలవిచ్చాడు (రోమీయులకు 12:20). అనగా, అక్రమ అభిచర్యలకు మనము ఈ విధంగా ప్రతిస్పందించినప్పుడు, నేరము చేసినవాడు సిగ్గుతో కాలిపోవును – బహూశా వాని దుర్మార్గపు క్రియల గూర్చి మారుమనస్సు కూడ పొందవచ్చును.

**వచనము 40**. యేసు వర్ణించిన రెండవ సోదాహరణము, ఒకని మీద న్యాయస్థానములో చేయబడిన నేరారోపణమును చిత్రికరించినది, న్యాయస్థానమునకు అభియోగము తెచ్చినవాడు ముద్దాయి యొక్క వస్త్రములను తీసికొనుటకు ప్రయత్నించుచున్నాడు: **ఎవడైన నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసికొనగోరిన యెడల వానికి నీ పైవస్త్రము కూడ ఇచ్చివేయుము.** ముద్దాయికి చాలినంత ఆర్థిక వనరులు లేనట్లయితే, వాడు చేసిన అప్పునకు వస్త్ర రూపేణ జామీను ఇవ్వవచ్చును లేక చెల్లింపవచ్చును. యేసు అతిశయోక్తిని ఉపయోగించుటను కొనసాగించాడని స్పష్టమగుచున్నది, ఏలయనగా "అంగీని" మరియు "పైవస్త్రమును" కూడ ఇచ్చివేయుట వలన ముద్దాయి సహజంగానే దాదాపుగా దిగంబరియగును (వాని యొద్ద ఒకే జత బట్టలున్నాయనుకొందాము).

"అంగీ" లేదా "పైవస్త్రము" (NIV) "ఒకడు ధరించు అంగీ వలె చేతుల వరకు వచ్చు భాగము గల పొడుగాటి లోదుస్తులై యుండినవి. ఈ దుస్తులు తరుచుగా పురుషుల చేత పొట్టిగాను మరియు స్త్రీల చేత చీలమండలము వరకుండునవియు ధరింపబడినవి."[41] అత్యంత ప్రాముఖ్యము మరియు విలువైన వస్త్రము, పై వస్త్రమై యుండెను (NIV). ఇది లోపలి ఉడుపుపై ధరింపబడిన వస్త్రమై యుండెను. ఒక వస్త్రముల గూర్చిన వివరము లూకా రాసిన సువార్తలో తారుమారుగా నున్నది, గనుక అది ఆ సందర్భములో వ్యాజ్యెమునకు బదులుగా వస్త్రము దొంగిలింపబడుచున్నదను సలహా ఇవ్వవచ్చును (లూకా 6:29).

పైవస్త్రము వాతావరణము నుండి కాపాడు ఒక సంరక్షక ముసుగుగా ఉండుటతో శీతాకాల

రాత్రుల్లో అదొక కంబళిగాను, ఎండాకాలంలో ఒక తలగడగాను ఉపయోగింబడినది. ఒకడు తీసికొనిన అప్పు లేక రుణము స్థానములో తన పైవస్త్రమును అప్పగించినప్పుడు సహితము, అది రాత్రయ్యేసరికి తిరిగి సొంతదారునికి ఇచ్చివేయవలెను (నిర్గమకాండము 22:26, 27; ద్వితీయోపదేశకాండము 24:12, 13; యోబు 22:5, 6). ఒకడు తన పై వస్త్రమును శాశ్వతముగా ఇచ్చివేయవలెనని న్యాయస్థానము కోరనప్పటికిని, వాడు దానిని తనంతట తానుగా ఇచ్చివేయవచ్చును. ఒకడు న్యాయస్థాన వ్యాజ్యములో ప్రత్యర్థి యెడల ద్వేషము కలిగి వానిని అసహ్యించుకొనుచు ఇరుపక్షముల వారికి విరక్తిని కలుగజేయు అనుభవమును కొనసాగించుట కంటే తన పైవస్త్రమును ఇచ్చివేయుట ఉత్తమమని యేసు చెప్పుచుండెను. అటుతరువాత, ఒక క్రైస్తవుడు వాని వ్యాజ్యెమును అవిశ్వాసుల యెదుట న్యాయస్థానమునకు తీసికొనిపోవుట కంటె వాడు వంచింపబడుటయే వానికి ఉత్తమమని అపొస్తలుడైన పౌలు రచించాడు (1 కొరింథీయులకు 6:1–8).

**వచనము 41.** యేసు ఉపయోగించిన మూడవ సోదహరణము, యూదులు వారి కొరకు వారి బరువులను మోయునట్లు రోమా ప్రభుత్వాధికారులు యూదులను అధికారపూర్వకంగా నిర్బంధించుచుండిన అభ్యాసమునకు సంబంధించినదై యుండెను. **ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్లు వెళ్లుము.** "బలవంతము చేసిన యెడల" అని అనువదింపబడిన క్రియా పదము ఒక పారసీక ఎరువు మాటయై యున్నది మరియు "బలాత్కారము చేయు" లేక "దండులోనికి చేరునట్లు నిర్భందించు" అని అది అర్థమిచ్చును. స్పష్టముగా, పారసీక దేశపు రాజకుటుంబ తపాలా సేవలు ఈ పదమును అర్థంచేసికొనుటకు అవసరమైన నేపథ్యముగా పనికివచ్చుచున్నవి. రాజ భవనము నుండి వెలువడిన సందేశములు తన సామ్రాజ్యమంతటను అందజేయబడునట్లు రాజైన కోరెషు ఒక అంచెటపా పద్ధతిని ప్రయోగించాడు. అతడు ప్రధాన రహదారుల వెంబడి తపాలా తావులను వ్యవస్థాపించాడు, ఒక్కొక దానికి మధ్య ఒక దిన ప్రయాణమంత దూరముండినది. సందేశములను ఒక తావు నుండి మరొక తావునకు చేరవేయుటకు గుఱ్ఱపు స్వారీ చేయుచు వెళ్లుచుండిన రౌతులు ఉపయోగించుకొనబడిరి. మొదటివాడు రెండవ వాడు మూడవ వానికి, ఇలా ఒకరి నుండి తరువాత వానికి అందజేయు రౌతులు ఉపయోగించుకొనబడిరి. మొదటివాడు రెండవ వానికి, రెండవ వాడు మూడవ వానికి, ఇలా ఒకరి నుండి తరువాత వానికి అందజేయు విధానములో సందేశములు అందజేసికొనబడుచుండినవి. తపాలా మోసికొని వెళ్లుచుండిన వార్తావహుడు ఒక *angaros* అని పిలువబడెను, గనుక తపాలాతో గుఱ్ఱపు స్వారీ చేయుచు వెళ్లుచుండిన పద్ధతి *angarēion* అని పిలువబడినది.[42] *Angareuō* అను పదమునకు "ఒక వార్తాహరుని పంపించుము" అనియు "ఒకనిని దళము లోనికి బలవంతము చేయుము" అనియు అర్థము. వార్తాహరులు, వారికప్పగింపబడిన కార్యభారమును నిర్వర్తించుటకు రాజాధికారము క్రింద నుండిన పౌరులను బలవంతము చేయుటకును, వారి గుఱ్ఱములను మరియు ఇతర వస్తువాహనములను ఉపయోగించుకొనుటకును అధికారము కలిగియుండిరి.

అటుతరువాత, ఆ దేశ పౌరులు వారి బరువులను మోయునట్లు వారిని రోమా ప్రభుత్వధికారులు బలవంతము చేయుచు ఈ అభ్యాసమును విస్తరింపజేసికొన్నారు. ఆ దేశ పౌరులకు గ్రీకు తత్త్వవేత్త ఎపిక్టెటస్ ఈ క్రింది విధంగా సలహా ఇచ్చాడు,

> మీరు మీ శరీరమంతటిని, సాధ్యమైనంత దీర్ఘ కాలము, బరువు భారముతో దాని నడుము క్రిందకు వంగిపోవుచున్న ఒక దయనీయమైన గాడిద వంటిదని ఎంచవలెను మరియు అది బలవంతముగా నిర్బంధింపబడి ఒక సైనికుని చేత చేజిక్కించుకొనబడినట్లయితే, అది తీసికొనిపోబడునట్లు అనుమతించండి, ఎదిరించవద్దు సరికదా సణుగవద్దు. మీరు ఎదిరించినా, సణిగినా దెబ్బలు తినుట మాత్రమే గాక అటువలెనే మీ చిన్న గాడిదను సహితము కోల్పోవుదురు.[43]

యేసు మోసుకొని వెళ్లుచుండిన సిలువను కురేనీయుడైన సీమోను మోయవలెనని సైనికులు అతనిని బలవంతము చేయుటకు అనుమతించిన ఆ పద్ధతి ఇదే (మత్తయి 27:32). ఒక రోమా సైనికుడు తన బరువు భారమును ఆ దేశ పౌరుడు ఒక రోమా మైలు దూరము మాత్రమే మోసికొని వెళ్లునట్లు కోరవచ్చును. విల్కిన్స్ ప్రకారము, "*Milion* అను గ్రీకు పదమునకు 'వెయ్యి అంగలు' అని అర్థము, ఈ దూరము దాదాపుగా 4,854 అడుగులుండును (అమెరికా దేశ ఆధునిక 'మైలు'నకు కొంచము తక్కువగా)."[44]

ఒక రోమా ప్రభుతాధికారి యొక్క బరువును అనివార్యమైన మైలు దూరము మోయవలెనని వారు బలవంతము చేయబడినప్పుడు ఆ విషయమును వారు ఎదిరించవలెనని తన శిష్యులకు ఉపదేశించుటకు బదులుగా, వారు రెండవ మైలు దూరము కూడ వెళ్లుటకు ఇష్టపడుచున్నవారై యుండవలెనని యేసు వారిని ప్రోత్సాహించాడు. ఇలా చేయుట వలన, ఒక క్రైస్తవుడు ఆ సైనికునిపై దైవభక్తిగల ప్రభావమును చూపించినవాడగును. ఆయనను వెంబడించుచుండినవారు – ప్రేమ మరియు గౌరవమునుబట్టి – నిర్వహించవలసిన విధులను మించి నిర్వహించవలసివారై యుండిరి. అటుతరువాత ఆయన "అటువలె మీరును మీకు ఆజ్ఞాపింపబడినవన్నియు చేసిన తరువాత, 'మేము నిష్ప్రయోజకులమైన దాసులము, మేము చేయవలసినదే చేసియున్నామని' చెప్పుడని" సెలవిచ్చాడు (లూకా 17:10).

**వచనము 42.** నాలుగవ సోదాహరణము, తిరిగి చెల్లించవలెనను ఉద్దేశము లేకుండా డబ్బు అడుగుచుండిన వానిని చిత్రీకరించినది. **నిన్ను అడుగువానికిమ్ము.** ఈ చివరి రెండు సోదాహరణములో, అది యిక మీదట అక్రమమైన అభిచర్యలు, లేదా బలవంతము చేత పనులు చేయించుట యెడల ప్రతిస్పందించుటకు సంబంధించినది కాదు, కానీ పేదలు చేయుచుండు నికార్సైన మనవులకు సంబంధించిన విషయమై యున్నది.[45] వారి మధ్య నున్న పేదల యెడల ఇశ్రాయేలీయులు ఔదార్యముగల దాతృత్వముతో వ్యవహరించవలెనని ధర్మశాస్త్రమే వారిని కోరినది (ద్వితీయోపదేశకాండము 15:7–11). లూకా 6:30లో గల సమాంతరమైన వాక్యభాగము గూర్చి లియోన్ మోర్రిస్ ఇలా వ్యాఖ్యానించాడు:

> మరొక పర్యాయము యేసు ఉపదేశమునకు సంబంధించిన స్ఫూర్తి ముఖ్యమైనదై యున్నది. క్రైస్తవులు ఈ విషయాన్ని బొత్తిగా అక్షరాలా పాటించినట్లయితే త్వరలోనే ఒక పావనమైన దరిద్రుల వర్గమువారుందురు, వారి యొద్ద ఏ సొత్తైనను ఉండదు, మరియు వర్ధిల్లుచున్న సోమరిపోతులు మరియు దొంగలకు చెందిన మరొక వర్గమువారుందురు. యేసు వెదకుచుండిన విషయము ఇది కాదు, కానీ ఆయనను వెంబడించుచుండినవారు ఇచ్చుటకు, ధారాళముగా ఇచ్చుటకు, ఔదార్యముతో ఇచ్చుటకు వారిలో గల సిద్ధమనస్సును ఆయన వెదకుచుండెను.[46]

ఇతరుల అవసరములు మన సొంత అనుకూలతలకు ముందు వచ్చునని యేసు పలుకుచుండిన

విధివాచకము స్పష్టముగా ధ్వనించుచున్నది.[47]

ఐదవ సోదాహరణము దీనికి ముందటి దానితో బహూ సమీప సంబంధము కలిగియున్నది, కానీ ఈ సందర్భములో ఒకడు మరొకని యొద్ద అప్పు అడుగు విషయమున్నది **నిన్ను అప్పు అడుగ గోరువాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు.** ఒక యూదుడు మరొక యూదునికి వడ్డి లేకుండా అప్పు ఇయ్యవలెనని ధర్మశాస్త్రములో ఒక అనుబంధముండినది (నిర్గమకాండము 22:25; లేవియకాండము 25:35-37; ద్వితీయోపదేశకాండము 23:19, 20). ఈ సందర్భములో సహితము, ఏడు సంవత్సరముల పిదప అప్పును స్వచ్ఛందంగా కొట్టివేయవలెనని ధర్మశాస్త్రము కోరినది. అప్పు తెచ్చుకొన్నవానికి ఇదొక ఆనందకరమైన అవకాశమును సృష్టించినది కానీ అప్పు ఇచ్చినవానికి అదొక మంచి పరిస్థితై యుండలేదు

డబ్బును వ్యాపార రీత్యా అప్పుగా ఇచ్చుట గూర్చి యేసు చర్చించుచుండలేదు. ఆ కాలములో ఇటువంటి అప్పులు అమలులో లేవు. దానికి బదులుగా, వ్యక్తిగత ఆర్థిక సహాయము న్యాయసమ్మతముగా అవసరమున్నవాని గూర్చి ఆయన మాటలాడుచుండెను. ఇటువంటి పరిస్థితి తలెత్తినట్లయితే, నష్టపరిహారమును గూర్చిన ఇటువంటి ఆలోచనయైనను లేకుండానే సహాయము చేయవలెనని తోటి యూదులు కోరబడిరి. ఇదే విధమైన ఉదారత కొరకే యేసు లూకా 6:34లో పిలుపునిచ్చాడు "మీరెవరియొద్ద మరల పుచ్చుకొనవలెనని నిరీక్షింతురో వారికే అప్పు ఇచ్చిన యెడల, మీకేమి మెప్పు కలుగును? పాపులును తామిచ్చినంత మరల పుచ్చుకొనవలెనని పాపులకు అప్పు ఇచ్చెదరు గదా." ప్రతిఫలము ఆపేక్షించని ఔదార్యము క్రీస్తు స్ఫూర్తిని ప్రదర్శించుచు అది దాతృత్వ హృదయము గల దాతలలో నుండు దేవుని వెలుగును లోకము చూచునట్లు చేయును.

## శత్రువులు (5:43-48)

**43నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; 44నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి. 45అయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీదను, అనీతి మంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు. 46మీరు మిమ్మును ప్రేమించువారినే ప్రేమించినయెడల మీకేమి ఫలము కలుగును? సుంకరులును ఆలాగు చేయుచున్నారు గదా. 47మీ సహోదరులకు మాత్రము వందనము చేసిన యెడల మీరు ఎక్కువ చేయుచున్న దేమి? అన్యజనులును ఆలాగు చేయుచున్నారు గదా. 48మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు.**

**వచనము 43.** వారికిని అన్యజనులకును మధ్య నుండిన సంబంధములకు సంబంధించి యూదులు నమ్ముచుండిన విషయమును యేసు పునః సమీక్షించాడు. ఒక ప్రక్క, **నీ పొరుగువాని ప్రేమింపవలెనని** ప్రజలకు బోధింపబడినది. క్లుప్తీకరింపబడిన ఈ ఉల్లేఖనము లేవీయకాండము 19:18లో నుండి తీసికొనబడినది "కీడుకు ప్రతికీడు చేయకూడదు, నీ ప్రజల మీద కోపముంచుకొనక, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను నేను యెహోవాను." యేసు దీనిని – "నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణహృదయముతోను, నీ

పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెనను" ఆజ్ఞకు తరువాతనే (లూకా 10:27; మత్తయి 22:34–39; ద్వితీయోపదేశకాండము 6:5 చూడుము) – రెండవ గొప్ప ఆజ్ఞగా గుర్తించాడు. దురదృష్టవశాత్తు, యూదులు వారు ప్రేమింపవలసిన యుండిన "పొరుగువానిని" బహు సంకుచితముగా – వారికి సన్నిహితముగా నున్నవానిగా, వారి అంతరంగ వలయమునకు పరిమితమై యుండిన స్నేహితులు, కుటుంబికులు, మరియు పరిచయస్థులు మొదలగు వారుగా – నిర్వచించుటకు ఉన్ముఖులై యుండిరి (లూకా 10:29–37).

మరొక ప్రక్క "నీ శత్రువును ద్వేషించుమని" ప్రజలకు తప్పుడు బోధలు బోధింపబడినవి. ప్రేమింపవలెనని ఉద్బోధించిన ఇదివరకటి ఆజ్ఞ వలె గాక, ఇశ్రాయేలు ప్రజలు తమ శత్రువులను ద్వేషించవలెనని వారికి నిర్దిష్టముగా ఆదేశములిచ్చుచుండిన ఉల్లేఖనము పాత నిబంధనలో లేదు.[48]

యూదులు వారి శత్రువులను ద్వేషించవలెనను అభిప్రాయము కుమ్రాన్ యొద్ద నుండిన తెగ వారి చేత స్పష్టముగా అభివ్యక్తము చేయబడినది. మృత సముద్రపు చుట్టలలో వారు "వెలుగు సంబంధులైన కుమారులనందరిని, ప్రతి ఒక్కరిని దేవుడు వానిని రూపొందించిన ప్రకారము, ప్రేమించవలెననియు, అంధకార సంబంధులైన కుమారులందరిని, ప్రతి ఒక్కరిని వాని దోషభావమునుబట్టి దేవుడు చేయు ప్రతీకారము ప్రకారము ద్వేషించవలెననియు" సభ్యులను *సమాజ నియమము* ఆదేశించుచున్నది.[49] యూదులు మొత్తంమీద "మనుష్య ద్వేషకులు" అని ముద్రవేయబడిరని జోసీఫస్ గమనించాడు, కానీ (యూదుడైన తానే) ఈ ఆరోపణమునకు తన అసమ్మతిని తెలియజేసాడు.[50]

**వచనము 44.** "నీ పొరుగువాని ప్రేమించుమను" ఆజ్ఞ విషయంలో, యేసు, "మీ శత్రువులను ప్రేమించుడని" చేర్చాడు. "ప్రేమించుడి" అను అర్థమిచ్చు ఇచ్చటి గ్రీకు క్రియాపదము *అగాపే* అను నామవాచకమునకు సంబంధించినదై యున్నది. అది అత్యున్నతమైన ప్రేమా రూపమును సూచించుచున్నది. ఈ పదము రసమయమైన మనోభావనుభూతులను కాదు, కానీ దానికి బదులుగా మరొకని ఔన్నత్యమైన మేలును వెదకుటను సూచించుచున్నది. వారు స్నేహితులైనా లేకా శత్రువులైనా, ఇతరుల సంక్షేమార్థమై ఏది ఉత్తమమైనదో ఆయన శిష్యులు దానినే చేయవలెనని యేసు చెప్పుచుండెను. లూకా రాసిన సువార్తలోని సమానాంతరములో, "మీ శత్రువులను *ప్రేమించుడి*, మిమ్మును ద్వేషించువారికి *మేలు చేయుడని*" యేసు చెప్పెను (లూకా 6:27; నొక్కి చెప్పింది నాది).

యేసు, **మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థన చేయుడని** కూడ చెప్పాడు (5:10–12 చూడుము). మన శత్రువుల యెడల సౌహార్ద అనుభూతులు కలిగియుండుటకు కష్టమైయుంటుండగా, వారు మన యెడల ఎలా వ్యవహరింపవలెనని మనము కోరుదుమో, మనము కూడ వారితో అలాగే వ్యవహరింపవలెను (7:12). డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఇలా చెప్పుచున్నాడు,

> మనము ఆయన యెడల మన అవిధేయతను ప్రదర్శించుచున్నప్పటికిని ఆయన మనలను ద్వేషించుచు దూషించువారిని సహితము ప్రేమించుటకు సమర్థుడైయున్నాడని మనలను మనము గుర్తుచేసికొనకుండా మనము మన శత్రువుల కొరకు చిత్తశుద్ధితోను పట్టుదలతోను ప్రార్థించలేము. మన శత్రువులను మనము దేవుని ప్రేమ యొక్క దృష్టికోణంలో చూచుట,

నిర్మాణాత్మకమైన చర్యలతో వారిని అబ్బురపరచుటకు మొదటి మెట్టయి యున్నది[51]

ఆయనను హింసించినవారి కొరకు యేసు తానే ప్రార్థించాడు. సిలువ మీద, "తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించుమని" అయన కేకవేశాడు (లూకా 23:34).

**వచనము 45.** ఒకడు తన శత్రువులను ప్రేమించుట పాపుల పట్ల గల దేవుని వైఖరిని ప్రతిబింబించునని యేసు భావించాడు. దేవుడు విశ్వాసుల మీదను దేవదూషకుల మీదను సూర్యుని ఉదయింపజేయుచున్నాడు, వర్షము కురిపించుచున్నాడు (కీర్తనలు 19:1–6; 145:9; అపొస్తలుల కార్యములు 14:16, 17). మన శత్రువులు మన స్నేహితులై యున్నట్లుగా వారి యెడల మనము ప్రతిస్పందించు క్షణంలో మనమున్నప్పటి కంటే, మనమెప్పుడైనను తండ్రి వలె ఉండము. మీ తండ్రి కుమారులు అను పదజాలము కుమారులు వారి తండ్రిని పోలి నడుచుకొను ఈ పాత్రను సూచించుచున్నది (ఎఫెసీయులుకు 5:1 చూడుము).

**వచనము 46. మీరు మిమ్మును ప్రేమించినవారినే ప్రేమించిన యెడల, మీకేమి ఫలము కలుగును**? అని యేసు ప్రశ్నించాడు. వానిని ప్రేమించువానినే ఒకడు ప్రేమించువాని విషయంలో ఏ ఒక్కరును అసాధారణమైన దేనినైనను కనుగొనలేరు. ఇతరులను ప్రేమించవలెనను లక్ష్యసాధన గూర్చి అతి తక్కువ అపేక్షగల మార్గమును ఎంచుకొనువారికి ప్రతిఫలము మిగులదు, ఏలయనగా **సుంకపు గుత్తాదారులు** సహితము ఇలాగే చేశారు.

సుంకపు గుత్తాదారులను ప్రజలందరు అసహ్యించుకొన్నారు ఏలయనగా వారు ప్రజల నుండి రోమా ప్రభుత్వము విధించిన సుంకములను పోగుచేయుచు తరుచుగా ప్రజలపై పరిమితికి మించిన భారం వేశారు. ఈ పద్ధతిలో పునరావృతమగుచుండిన ఒక విధానముండినది సుంకమును విధించు ప్రక్రియ హక్కుల కొరకు రోమా ప్రభుత్వము నిర్దిష్టమైన ఆయా ప్రదేశాల్లో వేలంపాటలను ఆహ్వానించినది. వేలంపాటను గెలుచుకొన్న వేలందారు తన క్రింద సుంకమును పోగుచేయు పనివారిని కూలికి నియమించుకొనును. ఇట్టి కూలిలకు వేతనములియ్యబడునట్లు న్యాయసమ్మతమైన చర్యయై యుండినది. అట్లయినప్పటికిని, ఈ పనివారు విధింపబడిన నిర్దిష్ట సుంకపు మొత్తము కంటె అత్యధిక మొత్తములో పోగుచేయుట వారికి అదొక పరిపాటైపోయింది. "సుంకమును పోగుచేయువారు ఎంత ఎక్కువ పోగుచేస్తే అంత ఎక్కువగా అసహ్యించుకొనబడిరి, వారు ఎంత ఎక్కువగా అసహ్యించుకొనుబడుచుండిరో అంత ఎక్కువ సుంకమును పోగుచేయుచుండిరి."[52] సుంకపు గుత్తెదారులను మత్తయి అన్యజనులు (5:46, 47; 18:17), పాపులు (9:10, 11; 11:19), మరియు వేశ్యల (21:31, 32) గుంపులతో కలుపుచున్నాడు. మిష్నా ప్రకారము, దొంగలు మరియు నరహంతకులతో కూడ వారికి సంబంధముండినది. [53]

**వచనము 47.** ఆయన అడిగిన ఇంతకు మునుపటి ప్రశ్నకు సమాంతరముగా, యేసు, **మీ సహోదరులకు మాత్రము వందనము చేసిన యెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి**? అని ప్రశ్నించాడు. రాబర్ట్ హెచ్. గుండ్రి ఇలా ప్రత్యేకించి సూచించుచున్నాడు, "ఒకరికి వందనము చేయుట మనము మాములుగా చెప్పుకొను 'హలో'ను మించినదై యుండినది. వందనములు చేసికొనుటలో ఇతరుల సంక్షేమమును కోరుచుండిన అభివ్యక్తములు ఇమిడియుండినవి."[54] ఒకడు తన శత్రువును ద్వేషించినట్లయితే, వాడు తన శత్రువును ద్వేషించినట్లయితే, వాడు

తన శత్రువుకు అసలే వందనము చేయడు.

ఈ విధముగా ప్రవర్తించినవారు – ప్రత్యేకముగా వారి కుటుంబములకు లేదా గుంపులకు సంబంధించిన వారికి మాత్రమే వందనము చేసినవారు – అన్యజనుల కంటే శ్రేష్టమైనవారేమీ కాదు. యూదుల వినికిడిలో ఇదొక కష్టతరమైన సందేశమై యుండును. ఆయన శిష్యులు ఇతరుల కంటె ఎక్కువ ప్రేమను ప్రదర్శించవలెనని యేసు ఆశించాడు. అన్యజనులను లేక వారు శత్రువులై యుండినవారిని ఆకర్షించునంతటి తారతమ్యమైనా తన శిష్యులలో కనుగొనవలసి యుండినది.

**వచనము 48.** ఆయన ప్రేమను గూర్చి చర్చించిన తదుపరి, ఉత్కృష్టమైన "గనుక" ("కాబట్టి") అను మాట యేసు నోట వెలువడినది. **మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు.** "పరిపూర్ణము" అను అర్థమిచ్చు గ్రీకు పదము "సంపూర్ణము" (19:21) లేక "పరిపక్వము" (1 కొరింథీయులకు 2:6; 14:20; ఎఫెసీయులకు 4:11, 12) అని కూడ అనువదింపబడవచ్చును. ఈ పదము ఇచ్చుట దేవుణ్ణి వర్ణించుచున్నదిగా ప్రయోగింపబడినందునుబట్టి, అది పరిపూర్ణతను సూచించుచున్నది. ఆయన శిష్యులందరు తమ్మునుతాము కొలుచుకొనవలసిన కొలమానము ఆయనే. దాని వెనువెంట నున్న సందర్భములో, ఈ పరిపూర్ణత దేవుడు ఈ లోకములో నున్న సమస్త జనులను ప్రేమించుచున్న రీతినే (1 యోహాను 4:7–21) ఒకడు వాని శత్రువులను ప్రేమించుటకు సంబంధించినదై యున్నది.

యేసు ఇచ్చిన ఆజ్ఞను పాటించుటకు అది అసాధ్యమైనదిగా అగుపించుట ద్వారా తన శిష్యులను పరాజితులను చేయుటకు ఉద్దేశింపబడినది కాదు, కానీ దానికి బదులుగా వారు దేవుని పోలి నడుచుకొనునట్లు వారిని ప్రోత్సాహించుటకే అది ఉద్దేశింపబడినది. ఒక ప్రక్క క్రైస్తవులు ఈ జీవితంలో "పరిపూర్ణులు" ("పరిపక్వత నొందినవారు"; NIV) కాగలరను అవగాహన ఉంటుండగా, మరొక ప్రక్క రాబోవు జీవితము వరకు వారు ఎన్నటికిని "పరిపూర్ణులు" కారను మరొక అవగాహన ఉన్నది. కాబట్టి, "నేను గురి యొద్దకే పరుగెత్తుచున్నాని" పౌలు చెప్పుచున్నాడు (ఫిలిప్పీయులకు 3:12–16). ఒకడు తన లోపముల గూర్చి కలిగియున్న చైతన్యవంతము వాడు దేవుని కృప యందు మరి ఎక్కువ లోతుగా నమ్మకముంచునట్లు వానిని ప్రోత్సాహింవలెను. కృప, వాడు పాపమును జయించగలుగునట్లు వానికే తిరిగి ఒక ప్రేరకముగా ప్రయోజనకరమైనదగును (తీతు 2:9–14).

"పరిపూర్ణులై యుండుడి" అను ఆజ్ఞ సార్థకమైన సమానాంతరములు కలిగియున్నది. "నీవు నీ దేవుడైన యెహోవా యొద్ద యథార్థపరుడవై యుండవలెనని" దేవుడు ఇశ్రాయేలీయులకు సెలవిచ్చాడు (ద్వితీయోపదేశకాండము 18:13). "మీరు పరిశుద్ధులై యుండవలెను, ఏలయనగా, మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనై యున్నాను" అని కూడ ఆయన సెలవిచ్చాడు (లేవీయకాండము 19:2), ఇది క్రైస్తవ విశ్వాసులకు పేతురిచ్చిన ఒక మందలింపై యున్నది (1 పేతురు 1:14–16). మైదానములో ఉండి చేసిన ఉపదేశములో, యేసు, "మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు మీరును కనికరముగలవారై యుండుడని" చెప్పాడు (లూకా 6:36).

## ఒక (ముందు) జాగ్రత్త హెచ్చరిక (5:21–26)

మనము (ముందు) జాగ్రత్తపరులమై యుండనట్లయితే, మనము కూడ యూదీయ మత పండితులు అభ్యసించుచు దేవుని నియమము నుండి తప్పిపోయి ప్రదర్శించిన అదే ఘోర దుశ్శీలమును ప్రదర్శించు దోషులమౌదుము. మనము క్రీస్తు నియమమును అర్థంచేసికొనుట సాధ్యమే, కానీ అది ఎన్నడును ఉద్దేశింపబడని విధంగా దానిని నిర్వచించి అనువదించుట అసాధ్యము. నియమము యొక్క – అసలు స్ఫూర్తి, విషయము, లేదా అర్థమును ప్రక్కనబెట్టి – అక్షరమును మాత్రమే పాటించుటతో మనము సంతృప్తిచెందుచున్నవారమై యున్నంత వరకు, వాస్తవమునకు మనము దానికి ఆమడ దూరములో ఉంటూనే, మనము విధేయులమై యంటున్నామని చెప్పుకొంటూ మనలను మనము బుజ్జగించుకొనవచ్చును.

## కోపము మరియు పాపము (5:21, 22)

యేసు సమస్త విధములైన కోపమును ఖండించలేదు, కానీ వ్యక్తిగత సంబంధములలో నుండి తలెత్తు కోపమును ఖండించాడు. పాపము పై మరియు అన్యాయము పై కోపమును అభివ్యక్తము చేయుటకు అనేక అవకాశములున్నవి. మన కోపములోని అధిక శాతము ఈ విషయములపై వ్యక్తము చేయబడకపోవుట ఒక సమస్యయై యున్నది. దానికి బదులుగా, మనము ఎదుర్కొను అవమానములు లేదా అన్యాయముల యెడల మనము మన ఆగ్రహావేశమును మండించుదుము. వ్యక్తిగతముగా దాడిచేయబడినప్పుడు అతి సులభముగా మనము ఆగ్రహము చెందుదుము, కానీ కోకొల్లలుగా నున్న ఇతర అన్యాయముల గూర్చి మనము నెమ్మదిగా ప్రతిస్పందించుదుము. యేసు సహితము కోపగించుకొన్నాడు (21:12, 13; 23:17; మార్కు 3:5), కానీ వీటిలో ఏ ఒక్కటైనను తన సొంత అహం చుట్టూ తిరుగలేదు. "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు ఆయన శ్రమపెట్టబడియు, బెదిరించలేదని" పేతురు రచించాడు (1 పేతురు 2:23).

కొన్ని పర్యాయములు మన స్వాతిశయము మన సహేతుకమైన విషయములు మరియు సమస్యలను ప్రతిరక్షించుటలోనే నిమగ్నమైపోతుంది. అప్పుడు, మన సొంత దృష్టికోణంలో, మన ప్రత్యర్థులు మనపై మరియు మన హోదాలపై దాడిచేయుచున్నవారుగా అగుపించుదురు. గనుక ఈ పరిస్థితి మనము కోపావేశంతో ప్రతిస్పందించునట్లు చేయును. ఆ సమయంలో వాస్తవమునకు మనలను మనము ప్రతిరక్షించుకొనుచున్నప్పటికిని, మనము సత్యమును ప్రతిరక్షించుచున్నామని అనుకొనుచు మనలను మనమే మోసపుచ్చుకొందుము. మనము సువార్తను ప్రతిరక్షించుకొనగోరినప్పుడు, మధ్యలో మన "అహం" చొరబడకుండునట్లు మనము నిశ్చయపర్చుకొన్నవారమై యుండవలెను.

## దేవుని ప్రమాణము (5:23–26)

మనలను మనము మానవులు వ్యవస్థాపించిన మత సంబంధమైన ప్రమాణములతో పోల్చుకొనుట మనకు సరిపోదు. మనము దేవుని ప్రమాణమునకు సరిపడుచున్నవారమై యుండునట్లు గురి పెట్టుకొనుటకు ప్రయత్నించవలెను (యోహాను 7:24; 2 కొరింథీయులకు

10:12, 13). మనము అపరాధము చేసిన లేదా మన యెడల అపరాధము చేసిన సహోదరునితో మనకున్న సంబంధము గూర్చి మాత్రమే కాదు, కానీ ఇటువంటి సంఘర్షణలు మనకును దేవునికిని గల సంబంధమును ఎంతో బాధించునని కూడ మనము ఆలోచించవలెను (1 యోహాను 3:14–18). వాస్తవమునకు దేవుని పరిశుద్ధ వాక్యము పట్ల మనకున్న వైఖరి ఈ ఆదేశమునకు గల మూలాధారములో నున్నది. ఆయన వాక్యము యెడల మనకున్న వైఖరులు మన చర్యలను నిశ్చయించును (1 యోహాను 5:2, 3) మన హృదయములు సరైనవిగా లేనట్లయితే, సమస్యలను మనము వెంటనే పరిష్కరించుకొనవలెను (2 కొరింథీయులకు 6:2). మనము చేయుచుండు ఆరాధన నిజముగా "ఆత్మతోను సత్యముతోను" కూడినదై యుండవలెనంటే (యోహాను 4:24), మనము అంతరంగములో ఒప్పితమైనవారముగాను శిష్టాచార విషయంలో సరైనవారముగాను ఉండవలెను.

### సమాధానపడుట (5:23–26)

అపరాధము చేయబడిన లేదా అపరాధము చేయుచున్న సహోదరునితో వ్యవహరించుటకు అవసరమైయున్న సరైన ప్రక్రియలను మనకు బైబిలు చూపించుచున్నది. ఈ వాక్యభాగములో, "నీకు విరోధముగా ఏదైనను కలిగియున్న" ఆ సహోదరునితో అత్యవసరముగా సమాధానపడవలసి యున్న పరిస్థితిని యేసు ఉద్ఘాటించి చెప్పాడు (5:23, 24). మరొక సందర్భములో ఆయన, "నీ సహోదరుడు పాపము చేసిన యెడల (" 'నీ యెడల' తప్పిదము చేసిన యెడల" అని అటుతరువాత రాతప్రతులు చేర్చాయి), నీవు పోయి నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు అతనిని గద్దించుమని" చెప్పాడు (18:15). "ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల, ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు, ... అట్టివానిని మంచి దారికి తీసికొనిరావలెనని" పౌలు గలతీయులకు తెలియజెప్పాడు (గలతీయులకు 6:1). ఈ సూత్రములు అభ్యసింపబడినట్లయితే, సంఘములలో తలెత్తుచుండు అనేక సమస్యలు పరిష్కరింపబడుటకు అది ఎంతో సహాయకరముగా నుండును.

మొదటి అన్వయములో (5:23, 24), మనకును మరియు క్రీస్తునందలి మరొక సహోదరుడు లేక సహోదరికిని మధ్య ఒక సమస్య ఉన్నదని మనమెరిగియున్నట్లయితే, యథార్థమైన ఆరాధన గూర్చిన హక్కును మనము కోల్పోయినవారమైయ్యామని యేసు సెలవిచ్చాడు. ఒక క్రైస్తవుడు వాని హృదయములో సంఘ సభ్యులలోని మరొక సహోదరుని యెడల గల నిర్దయతో కూడిన ఆలోచనలతో దేవుని ఆరాధించుటకు వెళ్లినట్లయితే, ఆయనను ఆరాధించుటకు వారు చేయు ప్రయత్నమునకు విలువే లేదని దేవుని వాక్యము మనకు గట్టిగా తెలియజెప్పుచున్నది. మన హృదయమే సరిగా లేనప్పుడు, దేవుని ప్రార్థించుటలో ఎటువంటి అర్థము లేదు. ఇది దేవునికి తెలియును (లూకా 16:15; 1 యోహాను 3:19, 20). "నా హృదయములో నేను పాపమును లక్ష్యముచేసిన యెడల, ప్రభువు నా మనవి వినకపోవునని" కీర్తనకారుడు రచించాడు (కీర్తనలు 66:18). మనము తోటి సహోదరునితో అసమాధానముగా ఉంటూనే, దేవునితో సత్సంబంధముగలవారమై యుండజాలము (1 యోహాను 2:8–11; 4:20, 21). వాస్తవమునకు, తన మనస్సులో ద్రోహము గల క్రైస్తవుడు వారి ఆరాధనలో ఇతరులకు ఆటంకముగా ఉందురు.

దుష్టత్వమును మంచితనముతో సమతూలనము చేయునట్లు చేయు ప్రయత్నమునకు

వ్యతిరేకముగా ఈ మందలింపు మనలను హెచ్చరించుచున్నది. పరిసయ్యులు సూక్ష్మాతి సూక్ష్మమైన విషయముల గూర్చి అతి జాగ్రత్తపరులై యుండిరి (23:23), కానీ దేనినీ లెక్కచేయకుండా వారు ఇతరులకు తీర్పులు తీర్చుచు వారిని ఖండించుచుండిరి. వారికి వలెనే, మనము కూడ క్రైస్తవులమై యుండవలసి యున్నదను విషయమును మర్చిపోవునంతగా "క్రైస్తవ పరిచర్యలో" నిమగ్నమైనవారమై యుండవచ్చును. ఆయా క్రైస్తవ చర్యలను బాహ్యముగా ప్రదర్శించుచు, మనము శత్రుభావానుభూతులు, అసహ్యము, లేక అసూయకు మన అంతరంగములో ఆశ్రయము కల్పించుచున్నవారమై యుండవచ్చును. సరైన దానిని చేయుటలో చాలినవారము కానప్పుడు మనలను మనమే మోసపుచ్చుకొందుము కానీ ఒక ఆరాధన ఆచారము ఈ పరిస్థితికి విరుగుడై యున్నదని మనము విశ్వసించుదుము. మనము దేవునితో సరైనవారమై యుండక మునుపు మనకును మన సహోదరులకును మధ్య గల విషయములలో మనము సరైనవారమై యుండవలెనని యేసు చెప్పుచుండెను.

రెండవ అన్వయములో (5:25, 26), సాధ్యమైనంత వరకు, తగువులాటలన్నియు న్యాయస్థానమునకు వెలుపలనే పరిష్కంచుకొనబడవలెనని ప్రభువు ఉద్ఘాటించి చెప్పాడు. ఎట్టి పరిస్థితులలోనైనను ఇది ముమ్మాటికి సత్యమే, కానీ తోటి విశ్వాసుల విషయంలో ఇది ముఖ్యముగా నిజమై యున్నది. మనము మన "కుటుంబ తగువులను" ఈ లోక న్యాయస్థానముల యెదుట ప్రదర్శింపకూడదని పౌలు మనలను ఆదేశించాడు (1 కొరింథీయులకు 6:1–8). యేసు క్రీస్తు హేతువు దూషింపబడుట కంటే మనము వంచింపబడినవారమగుటయే ఉత్తమమని ఆయన చెప్పాడు. ఒక క్రైస్తవ విశ్వాసి మరొకనిని న్యాయస్థానమునకు ఈడ్వకూడదు. కానీ యేసు మరియు పౌలు ఏర్పాటు చేసిన నియమములను పాటించవలెను. సరికదా, మనము దానిని నిరోధించుటకు అది మన ఆధీనములో లేక పరిధిలో ఉన్నట్లయితే మనకును ఇతరులకును మధ్య ఇటువంటి పరిస్థితి తలెత్తకుండునట్లు తగు ముందుజాగ్రత్తలు తీసుకొనుచు దానిని అనుమతించనూ కూడదు (రోమీయులకు 12:17, 18).

## లైంగిక సంబంధము గూర్చిన సత్యము (5:27–30)

లైంగిక సంబంధమును దేవుడు సృజించినందునుబట్టి, అది "మురికైనది" కాదు. దేవుడు మానవుని లైంగిక జీవిగా సృజించి వానికి సాటియైన సహవాసిని సమకూర్చాడు. లైంగిక అనుభూతుల కొరకైన మానవ సామర్థ్యము ఎంత శక్తివంతమైనదో దేవునికి తెలియును. తప్పుడు సంధర్భములలోని లైంగిక సంబంధము – అనగా, వివాహేతర సంబంధము – ఒకని శారీరక, భావోద్రేక, మరియు ఆధ్యాత్మిక సంక్షేమమునకు ఎంత వినాశనాత్మకమైనదై యుండునో ఆయన ఎరిగియున్నాడు. కాబట్టి, మన లైంగిక అభివ్యక్తలను నియంత్రించుకొనుటకు ఆయన మనకు నియమ నిబంధనలనిచ్చాడు. దేవుడు మనలను ప్రేమించుచున్నాడు, గనుక మనకు ఏది ఉత్తమమైనదో ఆయన ఎరిగియున్నాడు. "ఆషామాషీయైన లైంగిక సంబంధమనునది" ఏదీ లేదు. దూరదర్శినిలో ప్రసారమయ్యే కార్యక్రమములు మరియు చలనచిత్రములు అజాగ్రత్తతో కూడిన లైంగిక ప్రవర్తన మీద మోజు పుట్టించును, కానీ ఇటువంటి జీవితశైలి ప్రజల జీవితములకు కలుగజేయు భారీ హాని గూర్చి యోచించుటలో అవి విఫలమగుచున్నవి. ఒకరు మరొకరికి లైంగిక సంబంధములో అప్పగించుకొనుట ఒక తీవ్రమైన విషయమై యున్నది. లైంగిక సంబంధమనునది ఒక శారీరక చర్యను మించినదై యున్నది; ఇట్టి చర్యలో శరీరము,

మనస్సు, మరియు ఆత్మ సహితము చేరియుండునట్లు దేవుడు దానిని రూపొందించాడు.

ఆదియందు దేవుడు ఆదాము హవ్వలను సృజించినప్పుడు, "అది చాల మంచిదిగానుండెను" అని దేవుడు చూసాడు (ఆదికాండము 1:26-31). ఆయన వారి సంబంధమును ఆశీర్వదించి వారు "ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనవలెనని" వారికాజ్ఞాపించాడు. లైంగిక సంబంధము మూల పాపము కాదు. భార్యాభర్తల నడుమ నుండు సంబంధమును దేవుడే ఆదియందు సృజించెను (ఆదికాండము 2:22-25). ఈ సంబంధమునకు దేవుని వాక్యము దాని ఆమోదముద్ర వేయుచున్నది (హెబ్రీయులకు 13:4). వైవాహిక దాంపత్య ప్రేమ గూర్చి మనకు ఉపదేశించుటకు ఆయన ఒక పుస్తకమంతటిని (పరమగీతము) కేటాయించి ఆయన ప్రేరేపించిన లేఖనములలో చేర్చాడు. లైంగిక సంబంధ ప్రవర్తనను నియంత్రించుటకు ఆయన నియమించిన నిబంధనలు మన శ్రేయస్సు కొరకే ఉద్దేశింపబడినవి (19:1-9; 1 కొరింథీయులకు 7:3-5).

లైంగిక సంబంధము ఒక సమస్య కాదు. లైంగిక సంబంధము దూషింపబడుచు స్వార్థ ప్రయోజనాల నిమిత్తము కొల్లగొట్టబడుటతో సంతృప్తమైయున్న సమాజములో మనము నివసించుచున్నామనునది అసలు సమస్యయై యున్నది. పళ్లపొడి మొదలుకొని ప్రజా రవాణా వాహనముల వరకు కూడ ప్రతి వస్తువు ధారళముగా అమ్మకము చేయబడు నిమిత్తము లైంగిక సంబంధము ప్రయోగింపబడుచున్నది. దూరదర్శిని కార్యక్రమములు (స్త్రీ) పాతివ్రత్యమును బాహాటముగా హాస్యాస్పదము చేయుచు లైంగిక సైరత్వంతో స్త్రీపురుషులు అభేదకముగా కలిసికొనుచుండుట గూర్చి వేళాకోళం చేయుచున్నవి. లైంగిక సంబంధముల విషయములో వారు బాధ్యతాయుతంగా ప్రవర్తింపవలెనని ఉద్బోధించుటకు బదులుగా ఇంద్రియ సుఖమే శ్రేష్ఠమైన పురుషార్థమని ప్రోత్సాహించుచున్నవి.

ఒక గుంపు ఏంచేయుచున్నదీ, ఎందుకు చేయుచున్నదీ, అది సరైనదేనా కాదా అని తెలిసినా తెలియకపోయినా ఆ నలుగురితో పాటు వారు కూడ వెళ్లనట్లయితే వారు వింతైనవారని లేదా వారు అస్వాభావికమైనవారుగా నవ్వులపాలౌతారని నమ్మునట్లు మన చుట్టుప్రక్కల నెలకొని యుండు సామాజిక వాతావారణ సంబంధమైన ఒత్తిడులు, పరిపక్వతచెందిన వారిని ఒత్తిడిచేయుచున్నవి. తత్ఫలితంగా వైవాహిక బంధం లేకుండానే పుట్టుచున్న పిల్లలు, గ్భరస్రావములు, మరియు విడాకుల సంఖ్య పెరిగిపోవుచున్నది. లైంగిక సంభోగము ద్వార సంక్రమించు సుఖవ్యాదులు, ఎయిడ్స్ మొదలుకొని రుగ్మతలకు వ్యతిరేకముగా హెచ్చరికచేయు వ్యాపార ప్రకటనలు ప్రజలు వీటికి దూరముగా ఉండవలెను లేదా ఇవ్విధమైన సంబంధములు మానుకొనవలెనని హెచ్చరించుటకు బదులుగా అవి "నిరపాయమైన లైంగిక సంభోగమునకు" ప్రోత్సాహమిచ్చుచున్నవి. వివాహము చేసికొనక మునుపు లైంగిక సంబంధమునకు దూరముగా నుండుట మరియు దైవభక్తితో కూడిన నైతిక మరియు ఆధ్యాత్మిక విలువలు గల ఒకరిని వివాహమాడుట మాత్రమే నిజమైన లైంగిక సంబంధ అభ్యాసమై యున్నది. అటుతరువాత వివాహమాడిన దంపతులిరువురును పెళ్లినాటి ప్రమాణాల ప్రకారం ఒకరి యెడల మరొకరు విశ్వసనీయమైనవారై యుండవలెను.

లైంగిక సంబంధమైన కొన్ని వైఖరులలో మంచిని నెలకొల్పు దిశగా మార్పు వచ్చుట మొదలయ్యిందని ఇటీవలి కొన్ని అధ్యయనములు కొంత ఆశను కలుగజేయుచున్నవి. గర్భస్రావముల సంఖ్య తగ్గుముఖం పట్టింది, కొందరు యువతీయువకులు వారి పాతివ్రత్యము

గూర్చిన వాగ్దానములకు పూనుకొనుచున్నారు, మరియు కొన్ని ప్రదేశాల్లోని పాఠశాలలు కుటుంబ జీవితము గూర్చిన పాఠ్యాంశములలో వివాహమునకు మునుపటి లైంగిక సంబంధములకు దూరముగా ఉండవలసినదని ప్రోత్సాహకమిచ్చుచున్నవి.[55]

## కామవాంఛను ఓడించుట (5:27-30)

కామ వాంఛ వలన కలుగు పాపము గూర్చి యేసు హెచ్చరించాడు. అది ఆత్మను నాశనము చేయుచు తరుచుగా జారత్వమునకు లేక వ్యభిచారమునకు దారితీయును. మోహము గూర్చిన శోధన నేటి మన సమాజంలో నెలకొని యున్న ఆధునిక సంస్కృతి చేత పెద్దదిగా చేయబడుతోంది. విల్యమ్ హెన్డ్రిక్సెన్ ఇలా రాయుచున్నాడు,

> [పాపము] "చంపివేయబడవలెను" (కొలొస్సయులకు 3:5). శోధనను తత్‌క్షణమే ధ్రుఢనిశ్చయంతో రివ్వున దూరముగా పారదోలవలెను. ... దానికి చేయబడు శాస్త్ర వైద్యము సమగ్ర సంస్కరణార్థమైనదై యుండవలెను. సరిగ్గా ఇదే క్షణంలోను మరియు మనస్సులో ఎటువంటి అస్థిరత లేకుండాను అశ్లీల పుస్తకము చింపివేయబడవలెను, ఆత్మను నాశనము చేయు చలనచిత్రము ఖండింపబడవలెను, సన్నిహితమైనదై యుండియు ఆపదను సూచించు సామాజిక సంబంధము తెగదెంపులు చేసికొనబడవలెను, అనారోగ్యకరమైన అలవాటు తొలగించుకొనబడవలెను. పాపమునకు విరోధముగా చేయబడుచుండు పోరటములో విశ్వాసి తీవ్రముగా పోరాడవలెను. ముసుగులో గుద్దులాట పనికిరాదు. అది ఎన్నడును పనిచేయదు [1 కొరింథీయులకు 9:26, 27].[56]

డేవిడ్ స్ట్యూవర్ట్

## విడాకుల గూర్చిన యేసు బోధ (5:31, 32)

మత్తయి 19:1-12లో, యేసు వివాహము, విడాకులు మరియు పునఃవివాహము గూర్చి అనేక సత్యములను తెలియజెప్పాడు. *మొదటిది, జీవితకాలమంతటికిని ఒక స్త్రీకి ఒకే భర్త ఉండవలెననునది దేవుని ఆది ఆలోచనయై యున్నదని ఆయన చెప్పాడు* (19:3-5; ఆదికాండము 2:18-25). రెండు లింగములను, అనగా పురుషుడు మరియు స్త్రీని, సంతానోత్పత్తి కొరకును సాహచర్యము కొరకును దేవుడు సృజించాడని ఆయన తన శ్రోతలకు గుర్తుచేసాడు. దేవుడు పురుషుని స్త్రీ కొరకు మరియు స్త్రీని పురుషునికొరకు సృజించాడు, గనుక దేవుడు రూపొందించిన ఈ విధానములో చేయబడు ఎటువంటి మార్పైనను నియమోల్లంఘన ప్రవర్తనయై యుండును (రోమీయులకు 1:26, 27). దేవుడు ఆదాము హవ్వలను జతపరచాడు, అనగా తొలి వివాహ వేడుకను ఆయనే నిర్వహించాడని స్పష్టంగా గోచరమగుచున్నది. వైవాహిక బంధము శాశ్వతమైనదై యుండవలెనని భావించియున్నాడు.

*రెండవది, భవిష్యత్తులో సమస్త వివాహములకు వారు మాదిరికరమైన ఒక నమూనాగా ఉండునట్లు దేవుడు ఆదాము హవ్వలను జతపరచాడని మన ప్రభువైన యేసు క్రీస్తు చెప్పాడు* (19:6). వారిని జతపరచినది దేవుడే, గనుక వారిని వేరుచేయుటకు లేదా వేర్పాటుకు ఒక సహేతుకమైన కారణమును తెలియజెప్పుటకు ఆయనకు మాత్రమే న్యాయసమ్మతమైన హక్కున్నది. దేవుడు రూపొందించిన ఈ విధానములో అనావశ్యకముగాను అక్రమంగాను జోక్యము చేసికొనుట వలన విధ్వంసకరమైన ఫలితములు కలుగును. కన్నుల పండుగగా నుండు వివాహము యొక్క రమణీయమైన దృశ్యము ఆధునిక మన ప్రపంచంలో తెగదెంపులు

చేసికొనబడిన జీవితములు, నాశనమైన కుటుంబములు, మరియు అగచాట్లు పడుచున్న పిల్లలతో విస్తరించియున్నది.

*మూడవది, వివాహ స్థిరతను యేసు ప్రోత్సాహించాడు* (19:7, 8). వివాహమును గౌరవించుటకును, వారి నిబద్ధతల నుండి తప్పించుకొనుటకును రూపొందింపబడిన మోషే ఇచ్చిన మూలోపదేశములను పురుషులు ఉపయోగించుకొనుచుండిరి. "అలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు ఆజ్ఞాపించెను?" అని పరిసయ్యులు కొందరు యేసునడిగారు (19:7). ప్రజల హృదయ కాఠిన్యమే అందుకు హేతువని యేసు సమాధానమిచ్చాడు (19:8). పరిత్యాగ పత్రిక దేవుని ఆది ప్రణాళికలోని భాగము కానప్పటికిని, ప్రజలు ఆ ప్రణాళికను ఉలంఘించుచుండిరి. కాబట్టి, వివాహ నియమము కాపాడబడునట్లు, వారు చేయుచుండిన పనులను నియంత్రించుటకు అవసరమైయుండిన ఆదేశములను మోషే ఇచ్చునట్లు దేవుడు అనుమతించాడు (ద్వితీయోపదేశకాండము 24:1–4). పరిత్యాగ పత్రికను దేవుడు ద్వేషించునని మలాకీ 2:14–16 మనకు తెలియజెప్పుచున్నది. దేవుడు ఎప్పుడైనా గాని ఈ విషయంలో తన మనస్సును మార్చుకొన్నట్లు క్రొత్త నిబంధనలోని ఏదియు సూచించుట లేదు. గనుక వివాహమును గూర్చి దేవుడు కలిగియుండిన మూలోద్దేశమును వివరించుటకు యేసు వివాహ వ్యవస్థ యొక్క మూలము వైపు తన మనస్సును మళ్లించాడు.

*చివరగా, యేసు వివాహ సంబంధములో గల పవిత్రతను ఉద్ఘాటించి చెప్పాడు* (19:9). భార్యాభర్తలిరువురిలో ఏ ఒక్కరైనను లైంగిక అవినీతిని (జారత్వము) ప్రదర్శించు విషయమును మినహాయిస్తే, ఏ ఒక్కరును ఏ విషయములోనైనను పరిత్యాగ పత్రిక నిమిత్తము ప్రయత్నించకూడదని ఆయన సెలవిచ్చాడు. మరొక హేతువునుబట్టి భర్త భార్యను గాని, భార్య భర్తను గాని విడనాడి పునః వివాహము చేసికొన్నట్లయితే, అతడు/ఆమె వ్యభిచారము చేయుచున్న దోషియగును. విడనాడబడిన భార్యను వివాహమాడువాడు కూడ వ్యభిచారము చేయుచున్న విషయంలో దోషియగునని యేసు పై మాటలకు చేర్చాడు.

ఈ సత్యమును అపొస్తలులు ఒక కష్టమైన ప్రకటనగా గుర్తించారు (19:10), కానీ యేసు ఆయన చేసిన ప్రకటన సులభతరము చేయుటకుగాని దాని విషయంలో రాజీపడుటకుగాని ప్రయత్నించలేదు. దానికి బదులుగా, దేవుని వివాహ ప్రణాళికను ఉల్లంఘించుట కంటె నపుంసకుడై యుండుట ఉత్తమమైనదని ఆయన సెలవిచ్చునట్లు స్పష్టమగుచున్నది (19:12). వారు వివాహము చేసికొనక మునుపే యువతీ యువకులకు ఈ సత్యము ఉపదేశింపబడినట్లయితే, వివాహ నిబద్ధత గూర్చి వారు తీవ్రముగా ఆలోచించుటకు అవకాశముండును గనుక అప్పుడు వారు పరిష్కరించుకొనబడగల ఏదైన ఒక విషయమునుబట్టి వేగవంతమైన విడాకుల గూర్చి తీర్మానించుకొనుటకు బదులుగా వివాహము జయప్రదమగునట్లు శ్రమించుటకు మరి ఎక్కువ ప్రయత్నించగలరు.

## సత్యము (5:33–37)

ఈ రోజుల్లో సత్యము ఒక అరుదైన విషయంగాను అత్యంత విలువైన అంశముగాను ఉన్నది. ప్రజల్లో అధిక శాతం మంది కొన్ని పర్యాయములు అబద్ధమాడుట గూర్చి అపరాధిత్వ భావముగలవారైయున్నారని ఇటీవల అధ్యయనములు బయలుపరచుచున్నవి.[57] తమ్మునుతాము మంచివారనిపించుటకు, తమ్మునుతాము లేదా తమ ప్రియులను సత్యము చెప్పుట వలన

కలుగు హాని నుండి కాపాడుటకు, మరొకరి మనోభావలను దెబ్బతీయకుండుటకు, లేదా వారికి చికాకు కలిగించువారిని తమకు దూరంచేసికొనుటకు వారు అబద్ధమాడుచుందురు. మనము "మరొకరి మనోభావములకు గాయము కలిగించకుండునట్లు అబద్ధము" చెప్పవచ్చును, కానీ అబద్ధము అబద్ధమే ఔతోంది. అబద్ధమాడువారు వారి "తండ్రియగు అపవాది" పిల్లలై యున్నారని యేసు సెలవిచ్చాడు (యోహాను 8:44). "... అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురని" యోహాను రచించాడు (ప్రకటన 21:8; 22:15 చూడుము). "సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుమని" జ్ఞానియైనవాడు గ్రంథస్థంచేసాడు (సామెతలు 23:23). సత్యము మనలను స్వతంత్రులనుగా చేయునని యేసు చెప్పాడు (యోహాను 8:32).

## ఒట్టుపెట్టుకొనుట (5:33–37)

వారు చెప్పుచున్న విషయము సత్యబద్ధమైనదని ధ్రువీకరించుటకు, "... మీద ప్రమాణంచేసి చెప్పుచున్నానండీ" అని ఈనాడు అనేకులు పలుకుచుందురు. ఒకని మాటలు నమ్మదగినవైనట్లయితే, ఒట్టుపెట్టుకొనవలసిన అవసరమే లేదు. దేని మీదనైనను ఒట్టుపెట్టుకొనుట మన మాటలకు ఎటువంటి విలువను చేకూర్చదని యేసు సెలవిచ్చాడు (మత్తయి 5:34–36). మన విశ్వసనీయత కొరకు మరొకరు ప్రమాణము చేయుట కూడ ఏమీయు సహాయకరముగా ఉండదు. అలాగైతే, సహాయకరముగా నుండినదేమిటి? ఎల్లప్పుడు సత్యము పలుకుటయే మరియు విశ్వసనీయమైనవాడని అనిపించుకొనుటయే సహాయకరంగా ఉంటుంది (ఎఫెసీయులకు 4:25 చూడుము).

ఏదో ఒక దాని మీద ఒట్టుపెట్టుకొనుట ద్వారా మన మాటలు విశ్వసనీయమైనవను నమ్మకమును కలిగించునట్లు ప్రయత్నించుటకు బదులుగా, మనము పలుకుచున్నదేదో దానినే మన మాటలు తెలియజెప్పుచున్నవై యుండవలెనని యేసు సెలవిచ్చాడు. మనము "ఔను" అని పలికినప్పుడు అది ఔనన్నట్లుగానే ఉండవలెను! మనము "కాదు" అని పలికినప్పుడు, అది కాదన్నట్లుగానే భావింపబడవలెను! అప్పుడు ఇతరులు మనము పలుకుచుండు మాటలు నమ్మగలరు. నేటి మన ప్రపంచంలో, "నేను చెప్పుచున్న మాటే నా (పూచీ) పత్రము" అను సత్యమునకు దూరమైపోయి, "ఒక ఒప్పంద పత్రము లేకుండా నేను నీ మాటలను నమ్మలేను" అను పరిస్థితికి చేరువగా చేరుకున్నాము. ప్రజలు ఒకరి నొకరు నమ్మనప్పుడు, అది కుటుంబములోనైనా సరే లేదా సంఘములోనైనా సరే, చిరకాలము నిలిచియుండు సంబంధములను వ్యవస్థాపించుకొనుట అతి కష్టము.

## మన హక్కుల మాటేమిటి? (5:38–42)

వారి హక్కుల గూర్చి వారికుండిన పట్టుదలయే పరిసయ్యుల వక్రబుద్ధికి మూలమై యుండినది. మనము "స్వయం" లేక "అహం" అధికంగా శ్లాఘింపబడుచున్న కాలములో జీవించుచున్నాము. ప్రతి కోణంలోను మనము ఆత్మాభిమానముగలవారమై, అంతా మనమే అను భావముగలవారమై, స్వయం లాలసత్వముగలవారమై యుండవలెనని ప్రోత్సాహింపబడుచున్నాము. స్వార్థపూరితమైన ఈ యుగంలో, ప్రజలు పౌర హక్కులు, స్త్రీల హక్కులు, గాయపడినవాని హక్కులు, ఖైదీల హక్కులు, మరియు స్వలింగ సంపర్కుల

హక్కులు మొదలగు వాటిని సాధికారంతో అడుగుచున్నారు. ప్రజల మనస్సులు హక్కులలోనే, ముఖ్యంగా వారి సొంత హక్కులలోనే నిమగ్నమైపోయి యుంటున్నవి. మన జీవితంలో మన వ్యక్తిగత హక్కులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడుచున్నందు వలన మనము యథార్థమైన నీతిని మర్చిపోవుచున్నాము.

మత్తయి 5:38–42లోని వాక్యభాగము, క్రైస్తవులు దౌర్జన్యమును ఎన్నడును ఎదిరించకూడదను భావమును తెలియజేయుచున్నదని అనేకులు తప్పుగా అనువందించుచున్నారు. అది అహింసావాదమును ఉపదేశించుటకు, యుద్ధములు చెలరేగుచుండు సమయాల్లో "అంతరాత్మ ప్రబోధములచే పనిచేయు అభ్యంతరమునకు" మద్దతిచ్చుటకు, మరియు మరణ దండనకు వ్యతిరేకముగా వాదించుటకు ఉపయోగింపబడుచున్నది. ఎవరైనా ఒకరు మన యెడల అభ్యంతరకరముగా ప్రవర్తించినప్పుడు మనము ఎదిరించజాలమని లేదా ఎవరైనా ఒకరు ఒకని ఇంటిలోనికి దొంగతనంగా చొరబడినప్పుడు వాడు తన కుటుంబమును కాపాడుకొనలేదని యేసు భావించలేదు. ఆల్బర్ట్ బార్న్స్ ఇలా రాయుచున్నాడు,

> మన కుటుంబ సభ్యులు హత్యచేయబడుచుండగా మనము దౌర్జన్యకారులను ఎదిరించకుండా దానికి బదులుగా, ఊరకనే చూచుచుండవలెనని, లేదా మనమే హత్యచేయబడవలెనను విషయమును ఉపదేశించవలెనని యేసు ఉద్దేశించలేదు. ప్రకృతి స్వభావము, మరియు నియమములన్నియును, అవి మానవీయమైనవైనా మరియు దైవికమైనవైనా, ప్రాణము అపాయములో నున్నప్పుడు చేసికొనబడు స్వరక్షణను సమర్థించుచున్నవి. … దీని గూర్చి ఆయన మనస్సులోని భావమేమిటో మన రక్షకుడు వెనువెంటనే విశదీకరించుచున్నాడు. ప్రాణము అపాయములో నున్న ఒక పరిస్థితియై యున్నట్లుగా దానిని సూచించుటకు ఆయన ఉద్దేశించియుండినట్లయితే, ఆయన ఖచ్చితంగా ఆ విషయాన్ని పేర్కొనియుండెడివాడే.[58]

## "మీ శత్రువులను ప్రేమించుడి"
## (5:43–48)

ఒకడు తన శత్రువును ప్రేమించవలెనని యేసు సెలవిచ్చిన ఆజ్ఞ అనేకుల దృష్టికి అసాధ్యమైనదిగా అగుపించుచున్నది. కారణం? మనము "ప్రేమ" (*agapē*) అంటే దాని అసలు అర్థమేమిటో తరచుగా అపార్థము చేసికొనుట అందుకొక హేతువై యున్నది. మన యెడల అభ్యంతరకరముగా ప్రవర్తించినవాని యెడల మనము అనురాగసహితమైన అనుభూతులు కలిగియుండుట అసాధ్యమైనదై యుండవచ్చును, కానీ వారి యెడల మనము దయతో ప్రవర్తించుట మన శాయశక్తులకు మించినదేమి కాదు. 1 కొరింథీయులకు 13:4–7లో "ప్రేమ"ను గూర్చి పౌలు చెప్పిన నిర్వచనము, దాని దృష్టిని ఇతరుల యెడల మనము చేయవలసిన లేదా చూపించవలసిన చర్యలపై కేంద్రీకరించుచున్నది: ప్రేమ సహించును, దయ చూపించును, మత్సరపడదు, డంబముగా ప్రవర్తింపదు, ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు, అపకారమును మనస్సులో ఉంచుకొనదు. ఒకడు ఇతరులను ప్రేమించుచున్నాడనగా వాడు వారి శ్రేయస్సును కోరుచున్నాడని అర్థము. మనము ఇలా చేసినప్పుడు, మనము దేవుని పోలి నడుచుకొనుచున్నవారమౌదుము. ఆయన తన సృష్టిజాలము యొక్క నడవడితో తరుచుగా

దుఃఖించుచున్నాడు, కానీ ఆయన యింకను తన ఆశీర్వాదములను మన మీద కుమ్మరించుచు మన సమస్త అవసరములను తీర్చుచుచునే యున్నాడు.

డేవిడ్ స్ట్యూవర్ట్

---

సూచనలు

[1]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 111. [2]Ibid., 116; Talmud *Kiddushin* 28a; and Mishnah *Aboth* 3.12. [3]Michael J. Wilkins, "Matthew," in *Zondervan lllustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 38. [4]John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew - 1 Corinthians,* vol. 2, *Matthew - Mark* (Oxford: Oxford University Press, 1859: reprint, Grand Rapids, Mich.: Baker, 1979), 109. పరిశుద్ధ సత్యవేదమునకు వెలుపల ఈ పదము ప్రయోగింపబడిన యూదీయ రచనల నుండి Lightfoot నానావిధములైన ఉదాహరణములిచ్చాడు. [5]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 120. [6]Leon Morris, *The Gospel According to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 114. [7]See Joachim Jeremias, *Jerusalem in the Time of Jesus,* trans. F. H. and C. H. Cave (Philadelphia: Fortress Press, 1969), 17 చూడుము. [8]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 85. [9]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 52. [10]Mishnah *Yoma* 8.9.

[11]*Didache* 14.2. [12]Gundry, 87. [13]Lightfoot, 118 చూడుము; Talmud *Berakoth* 20. [14]*Leviticus Rabbah* 23.12; Talmud *Berakoth* 24a చూడుము; *Shabbath* 64b. [15]Sirach 9:8 (NRSV). [16]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 91. [17]Robert H. Mounce, *Matthew*, New International Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 46. *Skandalon* అను గ్రీకు పదము ఒక "ప్రగతి నిరోధకము"ను "ఉచ్చు"ను సూచించుచున్నది. ఆధ్యాత్మికముగా చెప్పుకొన్నట్లయితే, అది ఒకడు శోధింపబడి మరులుగొల్పబడునట్లు చేయునదై యున్నది (18:6, 7). [18]Eusebius *Ecclesiastical History* 6.8.1-2. [19]Mounce, 46. [20]Lewis, 92. *Rabbah Ecclesiastes* 1.4 చూడుము.


[21]ఈ నిర్మాణము KJV అనువాదము చేత తికమక చేయబడుచున్నది, అది మొదటి వచనమును "అప్పుడు" అను పదముతో మొదలుపెట్టుచున్నది. [22]Christopher Wright, *Deuteronomy,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1996), 255. [23]Lightfoot, 122. [24]Mishnah *Yebamoth* 14.1. ఏదిఏమైనా, ఒకడు తన భార్యకు పరిత్యాగ పత్రిక ఇవ్వవలెనని న్యాయస్థానము వానిని ఒత్తిడి చేయునట్లు ఆ స్త్రీ న్యాయస్థానమును ఒత్తిడిచేయగలదు. (Mishnah *Arakhin* 5.6; *Nedarim* 11.12.) [25]Josephus *Antiquities* 4.8.23. [26]పరిత్యాగ పత్రిక ఇచ్చుటకు సహేతుకమైన ఆధారముగా, ద్వితీయోపదేశకాండము 24:1లోని "మానభంగసూచన" అను పదమునకు గల అర్థము గూర్చి చేయబడుచుండిన వాదోపవాదము: ఒక ప్రక్క స్త్రీలను కాపాడుచు, మరొక ప్రక్క వారు తమ భార్యలకు పరిత్యాగ పత్రికలు రాసి ఇవ్వక మునుపు పురుషులు ఒకటికి రెండు పర్యాయములు ఆలోచించునట్లు చేయుటకు వాక్యభాగము ప్రదర్శించుచుండిన భారీ ఒత్తిడి నుండి పక్కదారి పట్టినది. [27]Mishnah *Gittin* 9.10. అటుతరువాత, ఆమె "తన సొంత భార్య కంటె మరొకరు [స్త్రీ] ఎక్కువ అందముగా ఉన్నదని అతడు కనుగొనినప్పటికిని" అని అకిబా అను యూదుల బోధకుడు చెప్పాడు. "ఆమె మీద అతనికి ఇష్టము తప్పినయెడల" అను పదజాలమును (ద్వితీయోపదేశకాండము 24:1) ఆయన ఈ దృక్పథమునకు ఆధారముగా చేసికొన్నాడు. [28]Hagner, 125. [29]W. F. Albright and C. S. Mann, *Matthew*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 65. [30]*Porneia* అను పదము, విశాల దృక్పథముతో ప్రయోగింపబడినప్పుడు, అది "వ్యభిచారము"ను (*moicheia*) కూడ దాని పరిధిలోనికి చేర్చుకొనగలదు. ఉదాహరణ "ఆమె తన జారత్వము ద్వార వ్యభిచారము చేసినదని" Sirach 23:23 చెప్పుచున్నది (NRSV).

[31]Mishnah *Ketuboth* 3.5; *Sotah* 5.1; *Yebamoth* 2.8. [32]Philo *Special Laws* 2.1.5; Mishnah *Nedarim* 1.3, 4. [33]Mishnah *Shebuoth* 4.13. [34]Mishnah *Sanhedrin* 3.2. [35]Josephus *Wars* 2.8.6. [36]Ibid., 2.8.7; *Community Rule* 5.7, 8 చూడుము. [37]*Code of Hammurabi* 196, 200. [38]Josephus *Antiquities* 4.8.35 చూడుము; Mishnah *Baba Kamma* 8.1, 2. [39]John MAcarthur, Jr., *The MacArthur New Testament Commentary: Matthew 1-7* (Chicago: Moody Press, 1985), 332. [40]Mishnah *Baba Kamma* 8.6 చూడుము.

[41]Wilkins, 41. [42]Herodotus 8.98; Xenophon *Cyropaedia* 8.6.17. [43]Epictetus 4.1.79. [44]Wilkins, 42. [45]Hagner, 131. [46]Leon Morris, *Luke: An Introduction and Commentary*, rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 143. [47]France, 127. [48]Morris, *Matthew*, 129-30 చూడుము. కనానుపై విజయము సాధించి దానిని స్వాధీనము చేసికొనుటకుగాను ఇశ్రాయేలీయులు వారి శత్రువుల యెడల పరుషమైన వైఖరులు ప్రదర్శించవలసి యుండినది. అట్టి సందర్భములో, వారి దుర్మార్గమునుబట్టి కనానీయులను శిక్షించుటకు దేవుడు తన ప్రజలను వాడుకొన్నాడు (ఆదికాండము 15:13–16; లేవీయకాండము 18:24, 25; ద్వితీయోపదేశకాండము 9:5; 1 రాజులు 14:24). [49]*Community Rule* 1.4; 9.21, 22 చూడుము. [50]Josephus *Against Apion* 2.15.

[51]Hare, 59. [52]Morris, *Matthew*, 132, n. 167. [53]Mishnah *Nedarim* 3.4; *Tohoroth* 7.6; *Baba Kamma* 10.1, 2. [54]Gundry, 99. [55]ఉదాహరణ 2008 జనువరి మాసంలో Alan Guttmacher Institute వారి చేత చేపట్టబడిన ఒక అధ్యయనము అమెరికా దేశములో గర్భస్రావముల సూచి 2000 మరియు 2005 సంవత్సరముల మధ్య కాలంలో 9% తగ్గిపోయిందని నివేదించినది. ("U.S. Abortion Rate Falls, Study Finds" [http://www.reuters.com/article/domesticNews/idUSN1722176020080117; Internet; accessed 15 July 2009].) [56]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 303. [57]Ulrich Boser, "We're All Lying Liars: Why People Tell Lies, and Why White Lies Can Be OK," *U.S. News & World Report* (http://health.usnews.com/articles/health/brain-and-behavior/2009/05/18/were-all-lying-liars-why-people-tell-lies-and-why-white-lies-can-be-ok.html; Internet; accessed 17 July 2009) ఇటువంటి ఒక నివేదికయై యున్నది. [58]Albert Barnes, *Notes on the New Testament: Matthew and Mark*, ed. Robert Frew (Philadelphia: N.p., 1832; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1974), 59.

# హేరోదు దేవాలయము


అంటోనియ దుర్గము
అన్యజనుల ఆవరణము
యాజకుల ఆవరణము
ఇశ్రాయేలు ఆవరణము
బలిపీఠము
సౌందర్య ద్వారము
స్త్రీల ఆవరణము
అతిపరిశుద్ధ స్థలము
పరిశుద్ధ స్థలము
సొలొమోను మండపము